ANN తెలుగు

Follow: @ANNTELUGU

20-10-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 315 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM








మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 20-10-2025
సాహిత్యం LITERATURE 02

# జీవితంలో...

ఉన్నవన్నీ మరిగిపోయి
ఏ కొద్దిగానో ఇంకా మరుగుతున్నట్టున్న
జీవపాత్రలా గతం

మరుగుతూ ఆవిరిలా
బయటపడుతున్న వర్తమానం

కొత్తగా ఏమి మరుగుతాయో

తెలియని భవిష్యత్తు
ఎవరికి తెలుసు?

కొందరు
గుర్తుంచుకుంటూ జీవిస్తుంటారు
మరికొందరు మరచిపోతూ
కొత్తగా జీవిస్తుంటారు



- ముకుంద రామారావు,
990 834 7273

## 26న శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదాన సభ

'కవిసంధ్య' సాహిత్య సాంస్కృతిక సంస్థ,ప్రతీ ఏటా నిర్వహించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదాన సభ, కవి సంధ్య దశాబ్ది ఉత్సవం ఈ నెల 26 న ఉదయం 10 గంటలకు యానాం, డా. బి. ఆర్. అంబేద్కర్ కళ్యాణ మండపం లో జరుగుతుంది.

శిఖామణి జీవన సాఫల్య పురస్కారం ఆచార్య కొలకలూరి ఇనాక్, శిఖామణి యువ పురస్కారం అవధానుల మణిబాబుఅందుకుంటారు. శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో మల్లాడి కృష్ణా రావు, మండలి బుద్ధ ప్రసాద్, అప్పాజోస్యుల సత్యనారాయణ, కోయి కోటేశ్వరరావు, కాళ్ళకూరి శైలజ, బొల్లోజు బాబా తదితరులు పాల్గొంటారు.

సాహిత్యం లో వివిధ ప్రక్రియలకు చెందిన పదిమంది ప్రముఖులు కవి సంధ్య ప్రతిభా పురస్కారాలు స్వీకరిస్తారు. ఈ సందర్భగా కవి సంధ్య-56 ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరుగుతుంది.

దాట్ల దేవదానం రాజు, కవి సంధ్య, యానాం, 94401 05978

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు
మొదలైనవి.. మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# గుర్తింపు



దర్భశయనం శ్రీనివాసాచార్య
94404 19039

గుర్తు పెట్టుకోవడం మానవ జీవనంలో ఒక ముఖ్యాంశం. మనం ఇష్టపడిన వాటిని, ఇష్టపడిన వారిని ఎక్కువ గుర్తు పెట్టుకుంటాము. ఇష్టపడని వాటిని, ఇష్టపడని వారిని అంతగా గుర్తు పెట్టుకోము . కొన్ని సందర్భాలలో గత విషయాలు కొన్ని మనకు అప్రయత్నంగా గుర్తుకొస్తుంటాయి. అవసరానుగుణ్యంగా కొన్నిటిని కావాలని మనం గుర్తు చేసుకుంటుంటాము. తాము అపుడపుడో , తరచుగానో చేసే కొన్ని పనులను ఇతరులు గుర్తించి వాటిని ఎక్కువ కాలం గుర్తు పెట్టుకోవాలని చాలా మంది కోరుకుంటారు . ఆ పనులు నలుగురు గుర్తించేంత విశిష్ట మైనవని అనుకుంటారు. సాహిత్యకారులు కూడా మానవ సమాజంలో భాగమే కనుక వారు కూడా తాము చేసే రచనలు విలక్షణమైనవని భావిస్తూ , వాటిని పాఠకులు చదివి గుర్తు పెట్టుకోవాలని కోరుకుంటారు . ఇది సహజం. సాహిత్యకారులందరూ ఏకరీతి అభిరుచితో రచనలు చేయరు. ఒక్కొక్కరి అభిరుచి ఒక్కోలా వుంటుంది . అట్లాగే పాఠకులందరి అభిరుచి కూడా ఒకేలా వుండదు. ఈ అర్థంలో అందరు కవుల అన్ని రచనలను పాఠకులందరూ ఒకేలా ఇష్టపడతారని గానీ , వాటిని గొప్ప రచనలుగా గుర్తిస్తారని అని గానీ అనలేం. ఇంకా చెప్పాలంటే, ఏ కాలంలోనైనా ఏ ఒక్క సాహిత్యకారుడి రచననూ ప్రపంచమంతా ఒకే మోతాదులో ఇష్టపడే అవకాశం లేదు.

తాను ఎంతగానో మథనపడి రాసిన రచన చాలా మందిని చేరినపుడు సాహిత్యకారుడు సంతోషించడం సహజం. తన కృషికి అర్థం లభించిందని తృప్తి పడతాడు. అదే రచన ఎక్కువ మందిని చేరకపోతే కొంతో, మరింతో అసంతృప్తికి లోను కావచ్చు. కాకపోవచ్చు కూడా, అతను స్థితప్రజ్ఞుడు అయితే . ఒక రచన చాలా మందికి నచ్చితే అది ఎక్కువగా గుర్తించబడినట్లుగా భావించబడవచ్చు. అపుడు అది గొప్ప రచన అని దాన్ని రాసిన వాడు గొప్పవాడనే పేరు రావచ్చు. గుర్తింపు అటు రచనకూ , ఇటు రచయితకూ రావచ్చు. అయితే , ఎక్కువ గుర్తింపుకు నోచుకున్న ప్రతి రచనా తప్పక ఎంతో ఉదాత్తమైనదనీ గానీ, అంతగా గుర్తింపు పొందని ప్రతి రచనా ఉదాత్తమైనది కాదని గానీ నిర్ధారణగా చెప్పలేం. ఒక్కోసారి ఎంతో ఉదాత్తమైన కొన్ని రచనలు ఎన్నో కారణాల వల్ల అంతగా గుర్తింపుకు నోచుకోకపోవచ్చు. ఒక దేశంలో లేదా ప్రాంతంలో ఒక కాల సందర్భంలో గొప్ప రచనగా గుర్తింపు పొందినది అదే కాలంలో మరో దేశంలోనో, మరో ప్రాంతంలోనో అంతే గుర్తింపుకు నోచుకోకపోవచ్చు. అట్లాగే ఒకే ప్రాంతంలో ఒక కాల సందర్భంలో విశేషాదరణ పొందిన రచనే మరొక కాల సందర్భంలో అంతగా ఆదరించబడక పోవచ్చు. విస్మరణకూ గురి కావచ్చు.

అయితే గుర్తింపు కోసమే సాహిత్యకారులు రచనలు చేస్తారా? కొందరు తమకు గుర్తింపు రావాలనే తపనతోనే రచనలను చేయవచ్చు. వాళ్ళకు గుర్తింపే లక్ష్యం . అట్లా చేసిన రచనలు సమాజానికి ఏ మాత్రం ఉపయుక్తం కానివని గానీ, నాణ్యతతో వుండవని గానీ అనలేం. వాటిలో సమాజహితమైనవీ వుండవచ్చు కూడా. కొందరు తమ ఆత్మానందం కోసం రచనలు చేస్తారు. ఆ విషయాన్ని వాళ్ళు చెబుతారు కూడా. వాళ్ళ జీవన సరళి కూడా తదనుగుణ్యంగా వుంటుంది. తమ రచనలకు గుర్తింపు రావాలని వాళ్ళు ఎదురు చూడరు. గుర్తింపు రాకపోతే ఏ మాత్రమూ వ్యాకులతకు లోను కారు. ఒక వేళ గుర్తింపు వస్తే ఆనందిస్తారు. కానీ వాళ్ళకు ఆత్మానందమే ప్రధాన లక్ష్యం. మరికొందరుంటారు వీళ్ళు రచనలను లోక హితం కోసం చేస్తారు.




రచనలకు కావాల్సిన మూలకాలను లోకం నుంచి తాము పొందామని, రచనల ద్వారా లోకానికి తిరిగి తాము ఇవ్వగలిగింది ఇస్తున్నామని వాళ్ళు విశ్వసిస్తారు. తమకు కాకుండా తమ రచనలకు ప్రాచుర్యం రావాలని వాళ్ళు కోరుకుంటారు. సమాజంలోని ఎక్కువ మందికి తమ రచనలు చేరాలని తద్వారా తాము ఆశించిన రచనా ప్రయోజనం నెరవేరాలని వాళ్ళు కోరుకుంటారు.

కొందరి రచనలు వాళ్ళు బ్రతికి వున్న కాలంలోనే ప్రాచుర్యం పొందుతాయి. మరి కొందరివి వాళ్ళు కీర్తి శేషులయ్యాక నుతించబడతాయి. దీనికి కారణాలనేకం. సాహిత్యకారులను గుర్తించే, సత్కరించే సంప్రదాయం రాజుల కాలాల నుంచీ వుంది. అయితే ఆ కాలాల్లో రాజాశ్రయం కోరుకున్న సాహిత్య కారులున్నారు . కోరుకోని వారూ వున్నారు. రాజులు సత్కరించిన సాహిత్యకారుల రచనలు మాత్రమే గొప్పవని అనలేం. రాజుల ఆశ్రయం కోరని కొందరి రచనలకు ఈ రోజుకీ గుర్తింపు వుంది. ఆధునిక కాలంలో సాహిత్య కారులకూ,ప్రజలకూ నడుమ ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది.సాహిత్యకారులకు పురస్కారాలను ప్రజాక్షేత్రం నుంచి అందించి గౌరవించే సంప్రదాయం ఒకటి ఇపుడు స్థిరపడింది . కొందరు వ్యక్తులు, కొన్నిసామాజిక వేదికలు , కొన్ని సాహిత్య సంస్థలు,ఆకాడమీలు , ప్రభుత్వాలూ వివిధ సందర్భాలలో ఇచ్చే పురస్కారాలు ఇప్పుడు ఎక్కువగానే వుంటున్నాయి . వాటి పట్ల సాహిత్య కారుల ఆసక్తీ పెరిగిందని స్థూలంగా చెప్పవచ్చు. పురస్కారాల కోసం ప్రత్యేకంగా వీలైనన్ని ప్రయత్నాలను చేసే వారు కొందరుంటారు. ఒకటి రెండు ప్రయత్నాలు విజయవంతమైతే, ఆ ఉత్సాహంతో వాళ్ళు ఇంకా ఎక్కువ/ పై స్థాయి పురస్కారాల కోసం మరిన్ని ప్రయత్నాలు చేస్తారు. ఒకటి రెండు ప్రయత్నాలు విఫలమైనా , ఎన్నేళ్లపాటైనా పట్టు వదలక మరిన్నిప్రయత్నాలు చేసే వాళ్ళు కొందరుంటారు. మరికొందరు నిరుత్సాహపడి తమ ప్రయత్నాలను మానుకోవచ్చు. లేదా రాయడమే మానుకోవచ్చు కూడా.

పురస్కారాల కోసం కొందరు యాచనకు సైతం సిద్ధపడతారు. పలుకుబడి వున్న వారిని ఆశ్రయించి పురస్కారాలు తెచ్చుకునే పనిలో వీళ్ళు వుంటారు. ఆ పనులు విజయవంతమైనపుడు ఫలానా వాళ్ళ పుణ్యమా అని తమకు పురస్కారం వచ్చిందని బాహాటంగా చెప్పుకునే వారు కొందరైతే. తమ ప్రతిభ వల్లనే పొందగలిగామని చెప్పుకునేవారు మరికొందరు. పురస్కారాలు లభిస్తే తద్వారా తమ రచనలకు, తమ ఆలోచనాధారకు ఎక్కువ ప్రాచుర్యం వచ్చే అవకాశాలుంటాయి కనుక అవి రావాలని కోరుకునే వారు కొందరుంటారు. అయితే వాటి కోసం వారు అర్రులు చాచరు. ఎవరినీ యాచించరు. వస్తే సంతోషిస్తారు. రాకపోతే దిగులు పడరు. వాళ్ళకు పురస్కారాలు ప్రధానం కాదు. ప్రభుత్వాలిచ్చే పురస్కారాలను తాము స్వీకరించనే స్వీకరించమని కొందరు బహిరంగంగానే చెబుతారు. ఒక వేళ ప్రభుత్వం ఇవ్వబూనినా వాళ్ళు వాటిని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తారు. వారిలో కొందరు ప్రైవేట్ సంస్థలు అందజేసే పురస్కారాలను స్వీకరిస్తారు. మరి కొందరు ఎవరినుంచీ ఏ పురస్కారాన్నీ స్వీకరించరు. దాన్ని ఒక నియమంగా పాటిస్తారు.

కొన్ని గుర్తింపులు ఇచ్చి పుచ్చుకునే పద్ధతిలో వుంటాయి. "నేను మీకు పురస్కారం ఇస్తాను, మీరు నాకు పురస్కారం ఇవ్వండి " అనే తరహా ఇది. ఇవి లోకానికి తెలుస్తాయని తెలిసినా ఈ ఉభయులూ సంకోచించరు. పురస్కార స్వీకర్తలుగా సంతోషాన్ని పొందుతారు. పురస్కారాలు పొందిన రచనలన్నీ అత్యుత్తమైనవని అనలేము. అట్లాగే పురస్కారాలు పొందని రచనలన్నీ సాధారణమైనవనీ అనలేం. ఉన్నత ప్రమాణాలతో పురస్కార నిర్ణయాలు జరిగినప్పుడు మేలైన రచనలకు పురస్కారాలు అందవచ్చు. అంతగా ప్రమాణాలు పాటించకుండా పురస్కారాల వితరణ సాగితే, మేలైన రచనలకు పురస్కారాలు అందక పోవచ్చు.

సోషల్ మీడియా వచ్చాక సాహిత్య కారులు తమ రచనలకు గుర్తింపుకోసం అవతలి వారి మీదనే పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం తగ్గింది. తమ రచనల గురించో, తమ గురించో తామే తమ ఫేస్ బుక్ లోనో, వాట్సాప్ ద్వారానో, ఇతర తాజా మాధ్యమాల ద్వారానో ప్రకటించుకునే వసతి ఇపుడు ఏర్పడింది. ఇది ఇప్పుడు ఉధృతంగా వాడుకలో వుంది. ఇక్కడ మరొక విషయాన్ని కూడా గుర్తించాలి. ఈ సమాజంలో మన చుట్టూ ఏ గుర్తింపునూ ఆశించక ఎంతో గుణాత్మకంగా పని చేసే రైతులూ, శ్రామికులూ, నీతిగా, నిజాయితీగా బ్రతికే అనేక మంది సామాన్యులూ, వైద్యులూ, సేవాతత్పరులూ కనపడతారు. వీరి ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతున్నది. వీరి శ్రమను కూడా గుర్తించడం సమాజపు బాధ్యత. బౌద్ధిక శ్రమకు గుర్తింపు అవసరమనుకున్నపుడు భౌతిక శ్రమకు కూడా గుర్తింపు అవసరం కదా. ఏ రకమైన శ్రమనైనా గుర్తించడం ఒక సంస్కారం. ఏ వివక్షలూ లేని, ఏ ఈర్ష్యాద్వేషాలూ లేని, ఏ అసమానతలూ లేని ఒక సంస్కారవంతమైన సమాజం రూపొందడానికి ఏ రచనలు ఉపయోగపడతాయో , ఆ రచనలు అత్యుత్తమమైనవి. అలాంటి వాటికి ఎంతగా గుర్తింపు వస్తే సమాజానికి అంత మంచిది. అలాంటి గుర్తింపుకు ఒక అర్థం వుంటుంది. అలాంటి రచనలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి గురించి వీలైనన్ని వేదికల మీద, వీలైనన్ని సందర్భాలలో మాట్లాడుకోవడం, చర్చించడం ఒక మంచి సంప్రదాయం. దీని పట్ల పెద్ద తరం సాహిత్య వేత్తలు ధ్యాస పెట్టి ఆ దిశలో నిర్మాణాత్మకంగా పని చేస్తే , అది యువ సాహిత్యకారులకు ప్రేరణ అయే అవకాశం వుంది.

("కవిత-2024" సంకలనానికి రాసిన సంపాదకీయం)

# అంబేడ్కర్ దారిలో కాశన్న కవిత్వం

## పుస్తక సమీక్ష



డా. సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321

ఎదిరెపల్లి కాశన్న ముక్కుసూటి మనిషి. నచ్చితే ఎత్తుకొని ఎదలకు అత్తుకుంటడు. ఎత్తేస్తే ఎనక్కి తిరిగి సూడడు. నాగర్‌కర్నూల్ నుంచి ఎనకట ఎక్ట్రీమ్ లెఫ్టిస్టులతో కలిసి నడిచిండు. ఆ తర్వాత దండోరా ఉద్యమంతో మమేకమయిండు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో భాగస్వామి అయ్యిండు. ఇప్పుడు బలంగా అంబేడ్కర్ ఐడియాలజీని ఆచరిస్తూ, ప్రచారం చేస్తున్నాడు. అందులో భాగంగా కొత్తగా 'రేపటి కాలం' నలుపుదే అనే కవితా సంపుటిని వెలువరించిండు. ఇది ఏడేండ్లలో ఆయన వెలువరించిన మూడో కవితా సంపుటి. గతంలో మూలచుక్క (2018), తిరగబడే నిషిద్ధుణ్ణి (2022) వెలువరించిండు. 50 ఏండ్ల కాశన్నను ఆది నుంచీ అకలి, అవమానం, అస్పృశ్యత, ఆర్థికలేమి వెంటాడినాయి. ఈ వెంటాడిన వేదనలే ఆయన కవితా వస్తువులయ్యాయి. ఈ విషయాల్ని అంబేడ్కర్ భావజాల దృక్కోణంతో ధిక్కరిస్తూ రాసిండు. స్వయంగా పాటగాడు కావడంతో ఈ కొత్త కవితా సంపుటిలో పాటలమీద ఎక్కువ కవితలున్నాయి. వాగ్గేయకారులు పాటకు చేస్తున్న గాయాలను ఆలపించిండు. మెజారిటీ దళితుల్లాగే కాశన్న అంబేడ్కర్‌ని గుండెలకద్దుకున్నాడు. కమ్యూనిస్టులు 'రాజ్యాంగవాదం' అని గేలి చేస్తే నిరసన గళమెత్తిండు. రైతుపై దమనకాండను ధిక్కరించిండు. గురుకులాల్లో పురుగుల న్నంపై నిలదీసిండు. చాయ్‌వాలా చౌకీదార్‌గా మారి చేస్తున్న చోరీ గురించీ రాసిండు. జాతీయవాదం ముసుగులో అంటా అంబానీ, ఆదానీలకు దోచిపెట్టడాన్ని ఎట్టి చూపించిండు. దేశం కోసం ప్రాణం అర్పించిన ఇంద్ర నేతలను తన కవిత్వం లో తూర్పారా పట్టిండు. మేఘవాల్ కు సైతం తప్పని కుల వివక్షను నిరసించిండు. నెల విడిచి పాలన చేస్తున్న అందరినీ సమానంగా చూసిన ఆర్టీసీని అక్కున చేర్చుకున్నడు. ధిక్కార దళిత గొంతుకను తెలంగాణ సగటు మనిషికి అండగా నిలిపిండు. ఆత్యాచారాలకు వ్యతిరేకంగా అక్షరమయ్యిండు. ఆ అక్షరాలకు అండగా నిలిచిన సావిత్రిబాయిని పూజించిండు. సావిత్రిబాయినే కాదు అందరికీ ఆప్తుడు నాగవరం బాల్‌రాం సారుని, మిత్రులు రావులపాటి సీతారాంని, బాల్ జంగయ్య సార్‌ని, బాక్సర్ నిఖత్ జరీన్‌ని, మిత్రుడు ఉప్పల ప్రవీణ్‌ని, కన్న తల్లిని కవిత్వంతో సత్కరించిండు.

ఈ సంపుటిలో విప్లవ కెరటం సావిత్రిబాయిని ఇట్లా కొలిచిండు.

''భారతదేశపు తొలిగురువు
సావిత్రీబాయి పూలే
కుంగిన గుండెలకి
కొత్త ఊపిరి
సంప్రదాయ కట్లు తెంచి
వక్రభాష్యం చెప్పిన శాస్త్రాలకు
బుద్ధిచెప్పి
వెలివాడల వెలుగై
అగ్నికణమై
నిద్రపోతున్న సమాజాన్ని
జాగృత పరిచింది''

తెలంగాణ ఉద్యమం గుండెలకద్దుకున్న అంబేడ్కర్‌ని కాశన్న కూడా కవిత్వాందలమెక్కించిండు.

''ఊరూరా
అంబేడ్కర్ విగ్రహాలనడుగు
ఆ చూపుడు వేలు
ప్రపంచానికి దారి చూపుతున్నది''

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కమ్యూనిస్టుల కుట్రలను ఇట్లా నిరసించిండు.


''మీ అహంకారం నెత్తికెక్కి
రాజ్యాంగం వైపు చూస్తున్నాయి
'కొడవలి' పరిస్థితి ఆస్పత్రిలో
ప్రమాదకరంగా వుంది
నూనె ఖర్చేగాని
పిల్ల బతకేతట్లు లేదు'' అని

తెలంగాణ నుడికారంతో అరుసుకున్నడు.

అంబేడ్కర్‌ని కీర్తిస్తూ

''సామాజిక విప్లవానికి
ఆయన తొలి సూత్రధారి
దళిత దార్శనికత్వానికి
అతడొక మహానది!'' అని రాసిండు.

ఇంతకుముందే చెప్పినట్లు కాశన్న పాటలు రాయడమే గాదు. వాటిని పాడడంలోనూ ప్రావీణ్యమున్నవాడు. పాటకు ఏ చిన్న గాయమైన తల్లడమల్లడమయ్యిండు. స్వప్రయోజనాల కోసం పాటను తాకట్టుపెట్టే వాళ్లని అక్షరాల్లో చెంప మీదికెళ్లి సరిశిండు.




''ఎందుకో పాటమ్మ
అమ్మ పాలు తాగి
అమ్మ తొమ్మును గుద్దుతోంది
ఆకలి, అవమానాలను
అమరుల త్యాగాలను
పాడిన నోటితోనే విషం చిమ్ముతుంది'' అంటూ అధికారం పంచన చేరి వంచన చేసే వారిని నిలదీసిండు. అంటే గాడు పాటల మీద పానం పెట్టి రాసిండు.

''వీధుల్లో
పాటలను
మాటలను రాశులుగా పోసి విక్రయిస్తున్నది
నా ఆదర్శం!''

''పాటనే లేకపోతే
ఇన్నాళ్లు మనస్సు
లో దాగిన
మర్మాన్ని ఎట్లా
చెప్పుదు
పాటనే లేకపోతే
ఇన్నాళ్లు కళ్లలో
దాగిన
ఈ దృశ్యాన్ని ఎట్లా వెలుగిస్తాను
ఎవరైనా పాడితే
మళ్లీ పాటలు నేర్చుకోవాలని వుంది
పాట పోగొట్టుకుంటే
మనిషికింకేం మిగుల్తుంది!! అంటూ
గర్వంగా పాటని నిలబెట్టిండు.

...

పాటగాళ్లు అమ్ముడుపోయింద్రని బాధపడ్డడు. గతి తప్పిన పాట తెలంగాణ మాతృగీతం కీరవాణి గొంతులో విన్నప్పుడు బాధపడి నిరసనగా

''ఒకప్పుడు యుద్ధగీతం
అప్పుడు రాష్ట్రగీతం
పాటకు ప్రాణం పోసిన అందెకు
వేగాడు గీతను బోధిస్తుండు''

...

''ఆకలి, పొట్టకు మధ్య
రొట్టె లాంటిది నా కవిత్వం'' అంటూ కవిత్వానికి తనదైన నిర్వచనం ఇలా ఇచ్చిండు.

గురుకులాల్లో పిల్లల అవస్థలను చూసి ఇట్లా స్పందించిండు.

''నాలుగు మెతుకులతో పాటు
నాలుగక్షరాలు నేర్చుతరనుకున్నం
మట్టి బతుకుల్ని
రేతొక్కి పారేస్తారు అనుకోలే
అక్షరాలకీ, అధికారానికీ
ఎప్పటికీ దూరమేనా?''

అక్షరాలను అందిపుచ్చుకున్న తరానికి అధికారమూ అందుతుంది అని కాశన్న ఆకాంక్షించాడు. రేపటి కాలం నలుపుదే అంటూ ధిక్కార గొంతుని వినిపించాచడు.

''ప్రపంచమే నలుపు వైపు చూస్తున్నది
దానికి కాకి బలగమంతా
చుట్టాలు'' అంటూ భవిషత్ మాదే అనే భరోసా ఇచ్చిండు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం అని నినదిస్తున్నాడు. ఈ సోయి నాగర్కర్నూలు లో కలిగిస్తున్న సాహితి మిత్రులు వనపట్ల సుబ్బయ్య ప్రభావంతో ''సాహిత్యం పట్ల అపారమైన మక్కువ పెంచుకున్నాను'' అని కాశన్న స్వయంగా ప్రకటించుకున్నాడు.

పీడిత ప్రజల తరపున దళిత కోణంలో అంబేడ్కర్ అందించిన దార్శనిక చూపుతో కవిత్వమై ధైర్యమిస్తుండు కాశన్న. అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే వాళ్ళు దళితులైనా స్పేర్ చెయ్యకుండా నిలదీస్తున్నడు. అంబేడ్కర్ పాఠాలను తర్వాతి తరానికి ఎరుక జేస్తున్న కాశన్నకు అభినందనలు.

# ఆద్యకళ మ్యూజియం కోసమే ఆయన తండ్లాట!

జానపద పరిశోధకుడిగా, పురా కళాఖండాల, పనిముట్ల, చారిత్రక ఆనవాళ్ల సేకరణకర్తగా ప్రొ. జయధీర్ తిరుమలరావు చేసిన కృషి సాటి లేనిది. అయితే ఆయన తండ్లాట అంతా తాను కూర్చిన ఆ అమూల్య పరికరాలను ప్రభుత్వ నిర్వహణలో ఒక మ్యూజియం రూపంలో చూడాలనుకోవడమే. దాని కోసం ఆయన కొన్ని ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ముప్పావు జీవితం గడిచిన ముదిమి వయసులోనూ వాటి సేకరణలో ఆయన విశ్రమించలేదు. దూరాభారాలు లెక్కచేయకుండా ఒంటరిగా దేశమంతా తిరుగుతున్నారు. తిరుమలరావు చేస్తున్న పనిని ఒక్క మాటలో చెప్పలేము. వస్తు సేకరణ ఎంతో శ్రమతో కూడుకున్న కార్యం. అది ఒకచోట కూచుంటే అయ్యేది కాదు. గ్రామీణ, సాంప్రదాయిక కళ సామాగ్రిని కనుగొని సేకరించడం మరీ కష్టమైన పని. గ్రామాలకు వెళ్ళాలి, డొంక దారుల్లో నడక సాగించాలి. ఆయా వస్తువుల సొంతదారులతో మమేకమవ్వాలి, వస్తువులను అప్పగించేందుకు వాటి భద్రతకు వారిలో విశ్వాసం కలిగేలా నమ్మకమీయాలి. సేకరించిన వాటిని వాతావరణానికి చెడిపోకుండా, దెబ్బతినకుండా భద్రపరచగలగాలి. ఎలా కాపాడాలో శాస్త్రీయంగా తెలిసుండాలి. వాటన్నిటిని పసిపిల్లల్ని సాకినట్లు సున్నితంగా చూసుకోవాలి. ఫలానా చోట ఓ పాతకాలపు వస్తువు ఉందంటే ఉన్నపళంగా ప్రయాణం కడతారు. సమయాన్ని, శ్రమను, ఖర్చును లెక్కించకుండా చేతికందిన ఆ కళాకృతిని చూసి మురిసిపోతారు. శ్రామిక కులాల సాంస్కృతిక సంపద, దళిత, ఆదివాసీ, బహుజన కళలు, కళారూపాలు, కళాకృతులు సంరక్షణే ధ్యేయంగా ఆయన పయనం సాగుతోంది.

తరతరాలుగా ఉత్పత్తి కులాలు తమ పనిముట్లను తామే తయారు చేసుకున్నట్లు వీరి సేకరణ నిరూపిస్తుంది. మానవ వికాస క్రమంలో వివిధ వృత్తుల్లో ఉత్పత్తికి తోడ్పడిన ఈ మూల పరికరాల, వాద్యాల, కళారూపాల పరిరక్షణ, ప్రదర్శన ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నది. విశ్వకర్మలు వెయ్యేళ్ల క్రితమే రుంజ ను మోగించినట్లు చరిత్ర చెబుతోంది. నాయకపోడు ఆదివాసీలు మూగ డోలు, బైండ్ల వారి జమిడిక, రాజన్నలు వాయించే చామల్లాలి, దడదడలాడే మాదిగ డప్పు, సిద్దిల మార్ఫా, కోయల డోలు, చెంచుల జేగంటలు, గుత్తికోయల గుజ్జడి మొగ్గలు అన్ని ఆనాటి వైభవ సంస్కృతులే. సాంస్కృతిక వారసత్వ కళా సంపదల పట్ల ఆసక్తితోనే దేశ విదేశీ యాత్రికులు చార్ మినార్, గోల్కొండ, సాలార్ జంగ్ మ్యూజియంలను చూసేందుకే హైదరాబాద్ కు వస్తుంటారు. 'ఆద్య కళ' వీటి వరుసలో చేరుతుంది.

సుమారు ముప్పై ఏళ్లుగా ఆయన సేకరిస్తున్న వీటిలో ఆది ధ్వని, ఆదిచిత్రం, ఆదిఅక్షరం, లోహ కళ అనే నాలుగు విభాగాలున్నాయి. ఆదిధ్వనిలో 350 కి పైగా రకరకాల ఆదివాసీ జానపద సంగీత వాద్యాల ప్రదర్శన ఉంది. ఆదిచిత్రంలో వివిధ ఆకారాల వస్త్రాలపై పండుగలు, సాంప్రదాయ ఆచరణకు చెందిన చిత్రాలు ప్రాకృతిక రంగులతో వేసిన చిత్రాలు, నకాషి బొమ్మలు ఉన్నాయి..ఇందులో కొన్ని మూడు వందల ఏళ్ళనాటివి కూడా ఉన్నాయి. ఆది అక్షరంలో తాళపత్రాలతో పాటు అక్షరాలు చెక్కిన తోలు పట్టాలు వింతగొల్పుతాయి. 500 కు పైగా ఉన్న ఈ అక్షరావళిలో 15 నుండి 20 మీటర్ల పొడవున్న ముతక కాగితపు చుట్టాల్లో చరిత్ర దాగిఉంది. యాదవులకు చెందిన కాటమరాజు చరిత్ర వీటిలో ఒకటి. వివిధ లోహాలు, మిశ్రమ ధాతువులతో రూపొందించిన చిన్న పెద్ద విగ్రహాలు నాటి హస్తకళల నైపుణ్యాన్ని చాటిచెబుతాయి. ప్రభుత్వ విభాగాలు లక్షలు వెచ్చించి చేసే పనిని ఆయనొక్కరు సొంత ఖర్చులతో చేసి పెట్టారు. ఏ రకంగా చూసినా వాటిని తెలంగాణ ప్రభుత్వం కళ్ళకద్దుకొని తీసుకోవాలి. తగినట్లుగా ఒక సం





దర్శనశాలను ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు ఎకరాల స్థలం లేదా ఏదో ఒక వాడకంలో లేని భవనం ఇస్తే అందులో మ్యూజియం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండే అడుగు ముందుకు పడాల్సి ఉంది. హైదరాబాద్ లో గత అయిదేళ్లుగా ప్రధాన గ్యాలరీలలో కొనసాగుతున్న వీటి ప్రదర్శనను, జనాదరణను గమనించి ప్రభుత్వం, సంబంధిత శాఖలు ఇప్పుడైనా ముందుకు రావాలి. నగరంలో ఎక్కడో ఓ చోట ఎన్నో ఆదివాసీ తెగలు, జానపద సమూహాలకు చెందిన ఈ అపురూప వస్తు సంచయం పాడు కాకముందే ఒక గూడు కల్పించవలసి ఉంది. తెలంగాణ ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి సేకరించిన సామాగ్రిపై ఒక నివేదికను తెప్పించి పరిశీలించాలి. మూడేళ్ల క్రితం పురాతత్వ ప్రదర్శనశాల వారి ఆహ్వానంపై తిరుమలరావు పారిస్ వెళ్లారు. ఆద్య కళ మ్యూజియం గురించి, తెలంగాణ ప్రాంతపు, భారత దేశపు జానపద ఆదివాసి కళల గురించి, సంస్కృతి గురించి, ముఖ్యంగా వస్తు సంస్కృతి అధ్యయనాల గురించి ఆయన అక్కడ ప్రసంగించారు. అప్పుడు జర్మనీ, స్విట్జర్లాండ్ లాంటి దేశాల ప్రతినిధులు వాటిలో కొన్నిటిని తమ మ్యూజియంలలో భద్రపరుస్తామని ముందుకు వచ్చారు. అయితే ఇది భారతదేశ సంపద, ఇవి భారతదేశంలోనే ప్రదర్శనగా కొనసాగాలని, ఆ ప్రతిపాదనను తిరుమలరావు ఒప్పుకోలేదు. ఈ పురా కళా సామాగ్రి విశిష్టతను గమనించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడైనా 'ఆద్యకళ' పరిరక్షణ పట్ల తగిన నిర్ణయం తీసుకోవాలి.

-బద్రి నర్సన్, 9440128169

Follow: @ANNTELUGU
20-10-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 315 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

ఒక్కో దీపాన్ని వెలిగిస్తూ
చీకటిని తరిమేసినట్టు..
మీ జీవితంలో ఒక్కోమార్పుని
ఆహ్వానిస్తూ కొత్త జీవితానికి
ఆహ్వానం పలకండి
మహా పత్రిక పాఠకులకు, కుటుంబ
సభ్యులకు దీపావళి శుభాకాంక్షలు
ఈ దీపావళి మీకు అష్ట ఐశ్వర్యాలను
సుఖ సంతోషాలు అందించాలి.
- మహాపత్రిక యాజమాన్యం

దీపావళి పండుగ రోజు కావడం వలన ఆఫీసుకు సోమవారం సెలవు దినం. మంగళవారం పత్రిక వెలువడదు. పునదర్శనం బుధవారం



## టాప్ న్యూస్

### అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి
- రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ దీపావళి శుభాకాంక్షలు



04

### తెలంగాణ ప్రజలకు కేసీఆర్ దీపావళి సందేశం
- ప్రజల జీవితాల్లో విజయకాంతులు నింపాలి



04

### అయోధ్యలో మహా ఘట్టం
- 26 లక్షల దీపాలతో గిన్నీస్ రికార్డు
- భక్తులతో నదీ తీరంలోని ఘాట్‌లు కిటకిట



04



04

## నవీన్ ఆల్ ది బెస్ట్..
- బి.ఫామ్ అందజేసిన పీసీసీ చీఫ్
- నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం

## ఖైరతాబాద్ ఖరారే?
### స్టార్ క్యాంపెయినర్‌గా దానం
- మరో ఉప ఎన్నికకు కాంగ్రెస్ పై
- డైరెక్ట్ గా హింట్ ఇచ్చిన పార్టీ
- అక్టోబర్ 31 లోగా నిర్ణయం తెలపమన్న సుప్రీం

**హైదరాబాద్, మహా:** ఖైరతాబాద్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ రెడీ అయినట్టు డైరెక్ట్ గా హింట్ ఇచ్చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు మేం బీఆర్ఎస్సే అంటుండగా, ఒక్క దానం నాగేందర్ ను మాత్రం దాని నుండి మినహాయించి.. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ గా పార్టీ ప్రకటించింది. పార్టీ మీరిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలని గత ఏడాదిన్నర కాలంగా బీఆర్ఎస్ పార్టీ కోర్టులను ఆశ్రయించింది. దీంతో అక్టోబర్ 31లోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీం నిర్దేశించింది. సుప్రీం ఆదేశాలతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేలకు నోటీసులిచ్చి విచారణ కూడా ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తరుపున సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి ఉండడంతో ఆయన ఉప ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమైంది.

మిగతా 4లో



## మావోలతో సంబంధాలు తెంచుకోండి
- తెలంగాణ నేతలకు బండి సంజయ్ తీవ్ర హెచ్చరిక
- లేదంటే కేంద్ర ఏజెన్సీలతో బట్టబయలు చేస్తామని వ్యాఖ్య
- 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర మంత్రి స్పష్టీకరణ

వివరాలు 4లో

## జూబ్లీహిల్స్ ట్విస్టులు
### కాంగ్రెస్ ప్లానింగ్‌తో బీఆర్ఎస్ అలర్ట్
మాగంటి సునితకు ప్రత్యామ్నాయంగా విష్ణు
అభ్యర్థిపై.. బీఆర్ఎస్ లో టెన్షన్
నవీన్ యాదవ్ కు పెరుగుతున్న మద్దతు
రసవత్తరంగా జూబ్లీహిల్స్ రాజకీయాలు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఎత్తుగడలు బీఆర్ఎస్ ను షేక్ చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్లానింగ్ తో ఏకంగా అభ్యర్థి విషయంలోనే జాగ్రత్తలు తీసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ ప్రకటన తర్వాత ఆ పార్టీ గ్రాఫ్ అనూహ్యంగా పెరగ్గా, బీఆర్ఎస్ అభ్యర్థిపై పార్టీ అగ్ర నాయకత్వం మల్లగుల్లాలు పడుతోంది.

మిగతా 4లో



## బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్
### జూబ్లీహిల్స్ లో చీకటి ఒప్పందం కంటిన్యూ...
సీఎం రేవంత్ సంచలన కామెంట్స్.. బీజేపీ, బీఆర్ఎస్‌లే బీసీ రిజర్వేషన్లకు అడ్డం



**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి బీ టీమ్ గా మారిందని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో రహస్య ఒప్పందంతో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని అందుకే బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోతే బీజేపీ ఎనిమిది సీట్లు గెలిచిందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి 37 శాతం ఓట్లు వస్తే, లోక్‌సభ ఎన్నికల్లో అది 15 శాతానికి పడిపోయిందని సీఎం తెలిపారు. మాయమైన ఈ 22 శాతం బీఆర్ఎస్ ఓట్లు ఎవరికి చేరాయని సీఎం ప్రశ్నించారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అదే చేయాలని కుట్రలు చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లోనూ ఓట్లు చీల్చాలని ఆ పార్టీ కుట్ర చేస్తోందని సీఎం ఆరోపణలు గుప్పించారు.

మిగతా 4లో




# జూబ్లీహిల్స్ ట్విస్టులు

- కాంగ్రెస్ ప్లానింగ్ తో బీఆర్ఎస్ అలర్ట్
- మాగంటి సునితకు ప్రత్యామ్నాయంగా విష్ణు
- అభ్యర్థిపై.. బీఆర్ఎస్ లో టెన్షన్
- నవీన్ యాదవ్ కు పెరుగుతున్న మద్దతు
- రసవత్తరంగా జూబ్లీహిల్స్ రాజకీయాలు

(మొదటిపేజీ తరువాయి)

ఓవైపు తామే గెలుస్తున్నామని ప్రచారం చేసుకుంటుండగా, బీఆర్ఎస్ అభ్యర్థికి సంబంధించిన కుటుంబ తగాదాలు.. సాంకేతిక సమస్యలతో నామినేషన్ తిరస్కరణకు గురయ్యే ప్రమాదముందన్న ప్రచారం జరుగుతోంది. ఒకవేళ నామినేషన్ తిరస్కరణకు గురైతే ప్రత్యామ్నాయంగా పిజెఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డిని ఉంచాలని డిసైడ్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే విష్ణు నామినేషన్ ను అర్థాంతరంగా, ఆదరాబాదరాగా వేయించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థికే షాక్ ఇచ్చేలా కాంగ్రెస్ చేసిన గ్రౌండ్ వర్క్ బీఆర్ఎస్ కు ముచ్చెమటలు పట్టిస్తున్నట్లు తెలుస్తోంది.

**నవీన్ యాదవ్ కు ఏకపక్షంగా ఉన్నందునే**

మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఏకపక్షంగా మద్దతు లభిస్తుండడం, సర్వేలలో కాంగ్రెస్ చాలా ముందుండడంతో.. మాగంటి సునిత పోటీ ఇవ్వలేకపోతున్నదని, అందుకే ఆమెను తప్పించి కనీసం పోటీలో నిలిపి పరువు దక్కించుకునేందుకే విష్ణును కొత్తగా తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయినా కనీసం 45వేల మెజారిటీతో నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో అనివార్యమైన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక రసవత్తరంగా మారింది. నవంబర్ 11న పోలింగ్ జరగనున్న ఈ ఎన్నికను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం చేస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించి నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి.

**అలర్టా.. కన్ ఫ్యూజనా**

బీఆర్ఎస్ పార్టీ దివంగత సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతకు మరోసారి అవకాశం కల్పించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్‌ను బరిలోకి దింపగా.. బీజేపీ తరపున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రధాన అభ్యర్థి మాగంటి సునీత ఇప్పటికే మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ.. ముందస్తు జాగ్రత్త చర్యగా పార్టీ మరో అభ్యర్థితో కూడా బీఆర్ఎస్ నామినేషన్ వేయించింది. దివంగత సీనియర్ నేత పి. జనార్దన్ రెడ్డి (పీజేఆర్) కుమారుడు, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణు వర్ధన్ రెడ్డితో కూడా బీఆర్ఎస్ తరపున ప్రత్యామ్నాయ నామినేషన్ దాఖలు చేయించింది. ప్రధాన అభ్యర్థి మాగంటి సునీత సమర్పించిన నామినేషన్ పత్రాలలో సాంకేతిక లేదా చిన్నపాటి తప్పులు ఉండి, ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైతే బీఆర్ఎస్ అభ్యర్థిగా విష్ణు వర్ధన్ రెడ్డి ఆ స్థానంలో పోటీలో నిలబడే అవకాశం ఉంటుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. మాగంటి సునీత నామినేషన్ సక్రమంగా ఉండి ఎన్నికల సంఘం ఆమోదిస్తే, నామినేషన్ల ఉపసంహరణ తేదీలోపు విష్ణు వర్ధన్ రెడ్డి తన నామినేషన్‌ను ఉపసంహరించుకుంటారని చెబుతున్నారు. విష్ణు నామినేషన్ పత్రం మీద సంతకాల కోసం తిరుగుతున్నపుడే మూడురోజుల క్రితమే దీనిని కాంగ్రెస్ నేతలు ఊహించారు. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 14న ఫలితాలు వెల్లడి కానున్నాయి. అన్నీ పార్టీలు ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. జూబ్లీహిల్స్ పై బీఆర్ఎస్ కూడా గట్టిగా వ్యూహరచన చేస్తున్నా.. పట్టు చిక్కడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఇపుడు ప్రధాన అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైతే మొత్తం ఎలక్షన్ వన్ సైడ్ గా మారుతుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. తెరవెనుక రాజకీయాలపై స్పష్టత రానుంది.

# నవీన్ ఆల్ ది బెస్ట్..

## బి. ఫామ్ అందజేసిన పీసీసీ చీఫ్

**నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం**

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నవీన్ యాదవ్‌కు ఆ పార్టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ బి.ఫామ్ అందజేశారు. ఆదివారం నర్సింగ్‌లోని తన నివాసంలో నవీన్ యాదవ్‌కు పీసీసీ చీఫ్ అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం నవీన్‌కు మహేశ్ కుమార్ గౌడ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రహమత్నగర్ కార్పొరేటర్సీఎన్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. ప్రచారం నిర్వహిస్తున్న తీరుతెన్నులు, చేపట్టవలసిన కార్యక్రమాలపై సూచనలు చేయడంతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి


## రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ దీపావళి శుభాకాంక్షలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజల జీవితాల్లో ప్రజా ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకువచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ వెలుగుల పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అన్నారు. దీపాల కాంతులతో ప్రతి ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్

## జూబ్లీహిల్స్ లో చీకటి ఒప్పందం కంటిన్యూ...

**సీఎం రేవంత్ సంచలన కామెంట్స్.. బీజేపీ, బీఆర్ఎస్‌లే బీసీ రిజర్వేషన్లకు అడ్డం**



(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం హైదరాబాద్ లోని చార్మినార్ దగ్గర రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి సీఎం, మంత్రులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షిద్ కి రాజీవ్ గాంధీ సద్భావన అవార్డును రేవంత్ రెడ్డి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లే బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని, పేదలకు సాయం చేయకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను దెబ్బతీసే ప్రత్యర్థి పార్టీల కుట్రలను తెలంగాణ సమాజం తిప్పికొట్టాలన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి దేశ అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని, 21 ఏళ్లకే శాసనసభ్యుడిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తూ రాజ్యాంగ సవరణ తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.

# అందరి లెక్కలు తేలస్తాం

## ఇంతకు ముందు లెక్క ఉండదు

- **ఇప్పటివరకు ఒక్క లీడర్ ఇంటిని కూల్చలేకపోయింది**
- **దిక్కుమాలిన విధానాలతోనే రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోయింది**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాట్ కామెంట్స్**




**హైదరాబాద్, మహా:** ఇంతకు ముందు లెక్క ఉండదని.. అందరి లెక్కలు తేలస్తామన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం పలువురు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆక్రమణల పేరుతో పేదల ఇండ్లను కూలుతున్నారని.. ఇప్పటివరకు ఒక్క బడా వ్యక్తి ఇంటిని కూల్చలేకపోయిందని.. మూసీకి అడ్డంగా కడుతున్నవారిని ఎవరూ పట్టించుకోవట్లేదని విమర్శించారు. పేదల ఇళ్లు కూలిస్తే అడిగేవారే లేరని భావిస్తున్నారన్నారు. పెద్దల వద్ద డబ్బులు గుంజి బెదిరింపులకు దిగుతున్నారని.. రియల్ ఎస్టేట్ కుప్పకూలడానికి ప్రభుత్వ విధానాలే కారణమని మండిపడ్డారు.

**పనులు చేయకుండా దందాలు చేస్తున్నారు..**

ఈ దిక్కుమాలిన ఆలోచనలు, విధానాలతోనే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోయిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే సీఎం మొదట దెబ్బకొట్టింది రాజేంద్రనగర్ నియోజకవర్గాన్నేనన్నారు. 2023 కేబినెట్ భేటీలో 400 కిలోమీటర్ల మెట్రో మంజూరు చేశామని.. ఎయిర్‌పోర్టు మెట్రోకు టెండర్లు పూర్తి చేస్తే రేవంత్ వచ్చాక రద్దు చేశారని.. తనకు భూములు ఉన్నాయనే అనుమానంతో ఆ పని చేశారని విమర్శించారు. రాజేంద్రనగర్‌లో భూములున్నాయని సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేశారని.. భూములు చూపితే రాసిస్తానని సబితా ఇంద్రారెడ్డి చెబుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి తాను బంపర్ ఆఫర్ ఇస్తున్నా.. భూములు ఎక్కడున్నాయో చూపించాలని.. కంపెనీలు, భవనాలు నావేనని చెబుతూ రెండేళ్లుగా జల్లెడ పడుతున్నారన్నారు. గత దీపావళికి మంత్రి బాంబులేటి.. బాంబులు పేలుతాయని చెప్పారని.. మళ్లీ దీపావళి వచ్చిందంటూ చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో పారిశ్రామికవేత్తలకు గొడుగులు పట్టి తీసుకువెళ్లామని.. కాంగ్రెస్ పాలనలో పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెడుతున్నారని.. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయకుండా దందాలు చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# తెలంగాణ ప్రజలకు కేసీఆర్ దీపావళి సందేశం

## ప్రజల జీవితాల్లో విజయకాంతులు నింపాలి

**హైదరాబాద్, మహా :** ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు చెప్పారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో విజయాల కాంతులు నింపాలని ఆకాంక్షించారు. అందరి జీవితాల్లో చీకట్లు తొలగి ఆనందపు వెలుగు నిండాలని కోరారు. దీపావళి సందర్భంగా ప్రతీ గడపలో ఆనందం వెల్లివిరియాలని అభిలషించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకుంటూ ఇంటిల్లిపాది సందడిగా, సంబురంగా సెలబ్రేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఖైరతాబాద్ ఖరారే?



(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలోనే రాజీనామాకు సిద్ధంగా ఉండాలని పార్టీ హైకమాండ్ ఇదివరకే సంకేతాలిచ్చింది. మహా పత్రికలో దీనిపై పలు కథనాలు వచ్చిన విషయం విదితమే. దానం కాంగ్రెస్ పార్టీనే అని జూబ్లీహిల్స్ ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ బహిరంగంగా అంగీకరించింది. దానం నాగేందర్ పేరును స్టార్ క్యాంపెయినర్‌గా చేర్చడం ద్వారా 'ఫిరాయింపుల వివాదం' మరోసారి తెరపైకి వచ్చింది. ఈ నిర్ణయం ద్వారా దానం నాగేందర్ అనర్హత వేటుకు గురైతే.. ఖైరతాబాద్ నియోజకవర్గానికి మరో ఉప ఎన్నికకు కూడా కాంగ్రెస్ సిద్ధమేనని పరోక్షంగా హింట్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ ఉప ఎన్నిక ప్రచారంలో దానం నాగేందర్ పాత్ర.. ఫిరాయింపుల అంశాన్ని మరింత వేడెక్కించే అవకాశం ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగియగానే, ఖైరతాబాద్ బైపోల్ కు కాంగ్రెస్ సిద్ధమవుతుందన్న సంకేతాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ అడుగులు దీనిని రుజువు చేస్తున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా రాజీనామాకు సై అంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఖైరతాబాద్ విషయంలోనే సాంకేతికంగా కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్న చర్చలున్నాయి. కాంగ్రెస్ నిజంగా సై అంటే, సుప్రీం మరోసారి ఆగ్రహిస్తే 2026లో మరో బైపోల్ ఖాయమని భావిస్తున్నారు.



# అయోధ్యలో మహా ఘట్టం

## 26 లక్షల దీపాలతో గిన్నీస్ రికార్డు.. భక్తులతో నదీ తీరంలోని ఘాట్‌లు కిటకిట

**అయోధ్య, మహా:** అయోధ్య నగరం దీపకాంతులతో వెలిగిపోతోంది. 9వ దీపోత్సవంలో భాగంగా సరయూ నదీ తీరం వెంబడి ఈ ఏడాది 26.17 లక్షల దీపాలు వెలిగించారు. అదేవిధంగా ఏకకాలంలో 2,128 మందితో హారతి నిర్వహించారు. ఈ రెండూ గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కినట్లు యూపీ ప్రభుత్వం వెల్లడించింది. పెద్దఎత్తున భక్తులతో నదీ తీరంలోని ఘాట్‌లు కిటకిటలాడుతున్నాయి. రామ్‌లీలా వంటి సాంస్కృతిక ప్రదర్శనలు, లేజర్ షో విశేషంగా ఆకట్టుకున్నాయి. రామ్ కీ పైడీ ఘాట్‌లో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ హారతి నిర్వహించారు. అంతకుముందు అయోధ్య రామమందిరంలో పూజలు నిర్వహించారు. రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు వేషధారణలోని కళాకారులు ఆసీనులైన రథాన్ని లాగారు. అనంతరం దీపాన్ని వెలిగించి.. వేడుకలను ప్రారంభించారు. దీపోత్సవం నేపథ్యంలో అయోధ్యలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.





# తడిబట్టలతో ప్రమాణం చేద్దామా?

- సవాల్‌కు సిద్ధంగా ఉంటే డేట్, టైమ్ ఫిక్స్ చేయ్
- మాజీ మంత్రి హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మండిపడ్డారు. కేబినెట్ సమావేశంలో జరిగిన చర్చలపై హరీశ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కౌంటర్ ఇచ్చారు. తడిబట్టలతో కేబినెట్ సమావేశంలో ఏం జరిగిందో చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మరి తన వ్యాఖ్యలకు హరీశ్ రావు కట్టుబడి ఉంటారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతితో సిద్దిపేటలోని వెంకటేశ్వర స్వామి దేవాలయానికి తడిబట్టలతో వచ్చి నా తల్లి దండ్రులపై ఒట్టేసి మరి ప్రమాణం చేస్తానని మరి తను ప్రమానం చేయడానికి హరీశ్ రావు సిద్ధమేనా అని చాలెంజ్ చేశారు. ఈ సవాల్ కు సిద్ధంగా ఉంటే హరీశ్ రావే డేట్, టైమ్ ఫిక్స్ చేయాలన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీపై హరీశ్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రివర్గం దండుపాళ్యం ముఠా కంటే అధ్వానంగా తయారైందని, కేబినెట్ మీటింగ్‌లో మంత్రులు అరడజను వర్గాలుగా విడిపోయి తన్నుకుంటున్నారని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మీ సెటిల్ మెంట్లు, కమీషన్లు, దోచుకోవడం, దాచుకోవడం స్వయంగా కేసీఆర్ బిడ్డ, మీ బంధువు కవితే చెప్పారని ముందు కవిత చేసిన ఆరోపణలకు హరీష్‌రావు సమాధానం చెప్పాలని కౌంటర్ వేశారు. 2004లో హరీశ్ రావు ఆస్తులెంతా ఇప్పుడు మీ ఆస్తులెంతో చెప్పాలన్నారు.

# 89,344 అప్లికేషన్స్

## 2620 మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు

**మరో మూడ్రోజుల గడువు పొడిగించిన ఎక్సైజ్ శాఖ**

**సర్కార్‌కు దాదాపు రూ. 24 కోట్ల ఆదాయం.. 27న లక్కీ డ్రా**

**హైదరాబాద్, మహా:** (202527) కొత్త మద్యం పాలసీ కోసం రాష్ట్రంలో ఉన్న 2620 మద్యం షాపులకు 89,344 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం అధికారికంగా వెల్లడించారు. ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచుతున్నట్లు ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. మద్యం షాపులకు నిర్వహణకు సంబంధించి శనివారం వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. దరఖాస్తుల స్వీకరణ ఆఖరు రోజు ఓబీసీ జేఏసీ బీసీ రిజర్వేషన్ల కోసం బంద్ పిలుపునివ్వడంతో గడువు పెంపుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. గత సంవత్సరం కూడా ఆఖరి రోజు 50 వేల దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు.

**అక్టోబర్ 27న లక్కీ డ్రా..**

ఈ వినతులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం దరఖాస్తుల తుది గడువును అక్టోబర్ 23 వరకు పెంచింది. ఈ గడువు పెంపు కారణంగా.. వాస్తవానికి ఈ నెల 23న జరగాల్సిన లక్కీ డ్రా కార్యక్రమాన్ని కూడా అక్టోబర్ 27వ తేదీకి వాయిదా వేశారు. ఈ వివరాలను ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. కొత్త మద్యం పాలసీ (202527) కోసం గత నెల 26న దరఖాస్తుల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం వరకు సుమారు 50 వేల దరఖాస్తులు రాగా.. తుది గడువు రోజు అయిన శనివారం ఒక్క రోజే రాత్రి 11 గంటల వరకు మరో 37 వేలకు పైగా దరఖాస్తులు అందినట్లు అధికారులు అంచనా వేశారు.



# బంద్‌లో దాడులు.. ఎనిమిది మంది అరెస్ట్

## షాపులపై దాడులు చేసిన వారిపై పలు సెక్షన్స్ కింద కేసులు

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బంద్ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో షాపులపై దాడులు చేసిన వారిపై పోలీసులు పలు సెక్షన్స్ కింద కేసులు నమోదు చేశారు. పలు స్టేషన్లలో కేసులు నమోదు కావడంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. బంద్ సందర్భంగా విద్యానగర్ నుంచి బర్కత్‌పురా వరకు బీసీ జేఏసీ నేతలు ర్యాలీగా వచ్చారు. అనంతరం, పలువురు కార్యకర్తలు, నేతలు.. పలు షాపులు, షోరూమ్స్, పెట్రోల్ బంకులపై దాడులు చేశారు. దీంతో, దాడులపై నల్లకుంట, కాచిగూడ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో దాడులకు పాల్పడిన ఎనిమిది మంది బీసీ జేఏసీ ప్రతినిధులను అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# మావోలతో సంబంధాలు తెంచుకోండి

- **తెలంగాణ నేతలకు బండి సంజయ్ తీవ్ర హెచ్చరిక**
- **లేదంటే కేంద్ర ఏజెన్సీలతో బట్టబయలు చేస్తామని వ్యాఖ్య**
- **2026 మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర మంత్రి స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, మహా :** తెలంగాణలోని కొందరు రాజకీయ నేతలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. మావోయిస్టులతో ఉన్న సంబంధాలను వెంటనే తెంచుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఓ పోస్ట్ చేసిన సంజయ్ "తెలంగాణ రాజకీయ నాయకులు దీనిని ఒక హెచ్చరికగా పరిగణించండి. వేదికలపై ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ, తెరవెనుక సాయుధ గ్రూపులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు వెంటనే తమ సంబంధాలను వదులుకోవాలి. లేదంటే వారిని బట్టబయలు చేస్తాం.



కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యలు కేవలం మావోయిస్టు కేడర్‌తోనే ఆగిపోవు" అని గట్టిగా హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో అవినీతి, నేరాలు, తీవ్రవాద సంబంధాలను కాపాడుతున్న శక్తులను కేంద్రం కనికరం లేకుండా అణిచివేస్తుందని ఆయన తెలిపారు. "సమస్యలో భాగమైన వారు ఎంత పెద్దవారైనా సరే పక్కకు తప్పుకోండి. దేశ అంతర్గత భద్రత విషయంలో తప్పు వైపు నిలబడితే ఎంతటి ఉన్నత నాయకులైనా పతనం కాక తప్పదు" అని స్పష్టం చేశారు. ఇటీవల మహారాష్ట్రలో లొంగిపోయిన సీనియర్ మావోయిస్టు నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బండి సంజయ్ ఈ హెచ్చరిక చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రూ.6 కోట్ల రివార్డు ఉన్న భూపతి, మరో 60 మంది కేడర్‌తో కలిసి 15 న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. తెలంగాణలోని కొందరు రాజకీయ నాయకుల రహస్య అండతో మావోయిస్టు పార్టీలోని ఒక వర్గం పనిచేస్తోందని భూపతి పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. అంతర్గత కలహాల వల్లే మావోయిస్టు పార్టీ విచ్ఛిన్నమవుతోందని, గిరిజనులు, పేదల కోసం పనిచేయాలన్న ప్రాథమిక సిద్ధాంతం నుంచి పార్టీ పక్కకు జరిగిందని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 1,785 మందిని అరెస్టు చేశామని, 477 మందిని మట్టుబెట్టామని ఆయన తెలిపారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## ప్రాణదాతలు కంది శ్రీనివాస రెడ్డి ఫౌండేషన్ అంబులెన్సులు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి స్థాపించిన కేఎస్ ఆర్ ఫౌండేషన్ అనేక సామాజిక సేవాకార్యక్రమాలతో జిల్లాలో మంచి పేరు సంపాదించుకుంటోంది. ప్రధానంగా అత్యవసర సమయాలలో రోగులను ఆసుపత్రులకు చేర్చుతూ అంబులెన్సులు ప్రాణదాతలుగా నిలుస్తున్నాయి. శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన భోరజ్ మండలకేంద్రానికి చెందిన గంభీర్ ను ఆదిలాబాద్ రిమ్స్ నుండి మెరుగైన వైద్య చికిత్సల కొరకు కెఎస్ ఆర్ ఫౌండేషన్ అంబులెన్స్ లో హైదరాబాద్ కు తరలించారు. అత్యవసర సమయంలో వెంటనే స్పందించిన కెఎస్ ఆర్ ఫౌండేషన్ సిబ్బందికి యజమాని కంది శ్రీనివాస రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## రవాణా చెక్ పోస్టులపై ఏసీబీ దాడులు



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ అంతర్రాష్ట్ర రవాణా చెక్ పోస్టుల పై ఎసిబి మెరుపు దాడులు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు చెక్ పోస్టులపై అర్ధరాత్రి నుండి తెల్లవారు జాము వరకు తనిఖీలు నిర్వహించి లెక్కలోని రాని నగదు స్వాధీనం చేసుకున్నారు ఏసీబీ అధికారులు . ఆదిలాబాద్ జిల్లా భోరజ్ చెక్ పోస్టులో 1లక్షా 26వేలు, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి చెక్ పోస్ట్ లో 5వేల వంద రూపాయలు,భైంసా చెక్ పోస్టులో 3 వేలరూపాయలు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు భోరజ్ చెక్ పోస్టులో ఇద్దరు అనధికార వ్యక్తులను గుర్తించినట్టు సమాచారం.కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.


## మార్కెట్ లో దీపావళి సందడి



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ మార్కెట్ లలో దీపావళి పండగ సందడి కనిపిస్తోంది. లక్ష్మీ పూజలకు సంబంధించి అరటి బోదెలు, ఇంటి గుమ్మాలను పూలతో అలంకరించేందుకు బంతిపూలు రాశులుగా పోసి అమ్ముతున్నారు. నిన్న మొన్నటి వరకు కిలో యాభై రూపాయలు పలికిన పూలు ఆదివారం 80 రూపాయలకు చేరాయి. అటు దీపాలు వెలిగించేందుకు రకరకాల ప్రమిదలు మార్కెట్లో కనువిందు చేస్తున్నాయి.సాధారణ మట్టి ప్రమిదలతో పాటు వివిధ డిజైన్లలో పోర్సెలిన్ ప్రమిదలు కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. కాని ఎక్కువ మంది సాంప్రదాయబద్ధంగా ఉండే మట్టి ప్రమిదలనే ఎంచుకుంటున్నారు. ధర తక్కువగా ఉండటంతో పాటు అవే శ్రేష్ఠమని కొనుక్కుని వెళ్తున్నారు.

## పండగ ముందు విషాదం

**రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి**



**కుమురం భీం ఆసిఫాబాద్ మహా :** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆసిఫాబాద్ మండలం మోతుగూడ వద్ద జాతీయ రహదారిపై కారు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వాంకిడి మండలం బెండారం గ్రామానికి చెందిన జగన్ అనే యువకుడు దీపావళి పండుగకు తన సోదరి అనసూయ ఆమె పిల్లలను వంజరి గ్రామం నుండి బైక్ పై తీసుకెళ్తుండగా దారిలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో జగన్ (27), అక్క అనసూయ(32), ఆమె కొడుకు ప్రజ్ఞశీల్ (05) మృతి చెందారు. మరో పాపకు తీవ్రగాయాలు కావడంతో కాగజ్ నగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతివేగంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో రెండు గ్రామాల్లోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సిపిఆర్ఎంఎస్ 8 లక్షల నుంచి 15 లక్షల పెంపుకు కృషి

**బిఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రమాకాంత్**




**మంచిర్యాల, మహా :** సింగరేణి బొగ్గుగని కార్మికులకు,మాజీ విశ్రాంత కార్మికులకు వైద్యపరంగా కల్పిస్తున్న సిపిఆర్ఎంఎస్ 8 లక్షల నుంచి 15 లక్షల పెంపుకు కృషి చేస్తున్నట్లు బిఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రమాకాంత్, గౌరవ సలహాదారు పులి రాజిరెడ్డిలు తెలిపారు. బొగ్గు గని కార్మికులకు ,మాజీ విశ్రాంత కార్మికులకు కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీమ్ (సిపిఆర్ఎంఎస్) లో వైద్య సౌకర్యం ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇస్తున్న 8 లక్షల కంటే ఎక్కువ పెరగడానికి బిఎంఎస్ 16 అక్టోబర్ నాడు కలకత్తాలో జరిగిన సమావేశంలో ప్రతిపాదన చేసిందని తెలిపారు. కార్మికుల వైద్య ఖర్చులు కనీసం 15 లక్షలకు ఇవ్వాలని డిమాండ్ చేయగా,కోల్ఇండియా యాజమాన్యం పరిశీలించి అంగీకరించనున్నట్లు తెలిపిందని వివరించారు. అలాగే జూన్, 2011 కంటే ముందు దిగిపోయిన కార్మికులకు పెన్షన్ తక్కువగా లభిస్తున్న విషయంపై కూడా సుదీర్ఘంగా చర్చలు జరిగాయని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు ,విశ్రాంత కార్మికులకు అపోలో, యశోద తదితర ముఖ్య ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యం కల్పించాలని కూడా కోరినట్లు తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కొరకు బి ఎం ఎస్ కృషి చేస్తుందని వెల్లడించారు.

## ఘనంగా లక్ష్మి కుబేర వ్రతం




**మంచిర్యాల, మహా :** ధన త్రయోదశి పురస్కరించుకొని మంచిర్యాల లక్ష్మీ బాలాజీ నగర్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీ లక్ష్మీ కుబేర వ్రతాన్ని వైభవపేతంగా నిర్వహించారు. ధన త్రయోదశిని పురస్కరించుకొని తమ ప్రాప్తి ధనలక్ష్మి కటాక్ష సిద్ధి కోసం శ్రీ లక్ష్మీ కుబేర వ్రతాన్ని కమిటీ సభ్యులు వేద బ్రాహ్మణులు రాధాకృష్ణతో నిర్వహించారు. గణపతి పూజ అనంతరం నవగ్రహ పూజ ఆ తదుపరి శ్రీ లక్ష్మీ సమేత కుబేర వ్రతాన్ని నిర్వహించారు. ఈ వ్రతంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు దారులకు ఆహ్వానం

**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ మున్సిపల్ పట్టణ ప్రజలకు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇల్లు నిర్మించుకోవడానికి స్థలం ఉండి ఎల్ 1, లేదా ఎల్ 2, లో మీ పేరు ఉంటే తేదీ 23 102025 తేదీ వరకు, లబ్ధిదారుని ఆధార్ కార్డు. మీ పేరు మీద ఉన్న ఇంటి స్థలం యొక్క డాక్యుమెంట్. ఇన్కమ్ సర్టిఫికెట్. రేషన్ కార్డు. మీ యొక్క వార్డ్ వివరాలతో శంషాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించగలరని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ తెలిపారు.





# గిరిపల్లెల్లో దండారి సందడి

**ఆదివాసీ సంస్కృతికి ప్రతిబింబం**

- గూడాలలో భక్తిశ్రద్ధలతో వేడుకలు
- ధింసా, గుస్సాడీ, కోలాటాలతో సంబరాలు
- ఆనవాయితీగా కొనసాగుతున్న సాంప్రదాయం

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీల అతిపెద్ద పండగ దండారి పండుగ సందడి ప్రారంభమైంది. పచ్చని అరణ్యాల నడుమ గిరిజనుల సాంప్రదాయ వేషధారణలు నృత్యాలతో గిరి పల్లెలు మార్మోగుతున్నాయి.దండారి నృత్యం గోండు తెగ సాంప్రదాయానికి ప్రాణం లాంటిది. పంటల పండుగగా, పశువుల ఆరోగ్యార్థం జరుపుకునే ఈ వేడుకలో పురుషులు రంగురంగుల గుడారాలు, మణిహారం, ముత్యాల దండలు ధరించి నృత్యం చేస్తారు. మహిళలు తాళబద్ధంగా పాటలు పాడి ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తారు. ఉమ్మడి జిల్లాలోని గిరిపల్లెలు మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయాయి. చిన్న పెద్దలందరూ ఒక చోట చేరి సంబరంగా పండగను జరుపుకుంటున్నారు. యువకులు సాంప్రదాయ వాయిద్యాలైన పెర్కుసన్ బేరులు, కమాచా, నగారా మోగిస్తూ సందడిని మరింత పెంచుతున్నారు.దండారి పండుగ పూర్వీకుల జ్ఞాపకార్థం జరుపుకునేదిగా ఆదివాసీ పెద్దలు వృద్ధులు చెబుతారు. ప్రకృతి, పంట, పశువులకు కృతజ్ఞతగా ఈ వేడుకను జరుపుతారని తెలిపారు. పండగతో గిరిజన గూడాలు, తండాలన్నీ దండారి సంబరాలతో కళకళలాడుతున్నాయి. గిరిజనుల ఆచార వ్యవహారాలు సంస్కృతి సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. గోండు గూడాలలో గిరిజననుల జీవన శైలిని ప్రతిబింబించే దండారి విచిత్ర వేషధారణలతో గుస్సాడీ నృత్యాలతో కొనసాగుతాయి.సాంప్రదాయ పద్ధతులతో వారు చేసే పూజలు ఏర్పాట్లు వారి ఆచార వ్యవహారాలను సంప్రదాయాలను సంస్కృతిని పరిచయం చేస్తాయి .దీపావళి పండగ రోజులలో దండారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఆదివాసీలు ఆయా గ్రామాల మధ్యలో నెమలి ఈకల తో ప్రత్యేకంగా తయారు చేసిన టోపీలు, జంతు చర్మంతో తయారు చేసిన డప్పులు, డోలు, లాంటి వాయిద్యాలతో పాటు గజ్జలు కోలాటాలు మంత్రదండం లాంటి రోకలి తదితర సంప్రదాయ వస్తువులను ధరించి నృత్యాలు చేస్తారు. ముందుగా ఆయా గ్రామాల్లో గ్రామ పటేల్ ఇంటి ముందు ఆయా అలంకరణ వస్తువులకు బలిదానం చేసి ప్రత్యేక పూజల అనంతరం ధరిస్తారు. అనంతరం దండారి సంబరాలు మొదలు పెడతారు. ఈ ఉత్సవాలలో భాగంగా 9 రోజులపాటు గుస్సాడి వేషధారులు ఒంటికి బూడిద పూసుకొని ఉంటారు .ఇది వారి తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం.దండారి అంటే డప్పు చాటింపు అని అర్థం. వారు తమ సొంత గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లి అక్కడి గిరిజనుల ఆతిథ్య విందులో పాల్గొంటారు. గుస్సాడీ వేషధారణ వేసిన వారిని తమ ఆరాధ్య దేవతలు ఆవహిస్తారని విశ్వాసం. వారి చేతిలో ఉన్న మంత్రదండాన్ని తాకితే ఎలాంటి రోగాలు రావని ఆదివాసులు నమ్ముతారు. దీపావళి పండుగ అనంతరం రెండు రోజుల తర్వాత కొలబోడి ఉత్సవాలతో దండారి సంబరాలు ముగుస్తాయి. గ్రామ శివారులలో ఉన్న భీమ్ దేవుని సన్నిధిలో వారి అలంకరణ వస్తువులను ఉంచుతారు.

## కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండల్ మాజీ ఎంపీపీ, పెద్ద షాపూర్ ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ 500 మంది అనుచరులతో కలిసి తెలంగాణ భవన్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో ఆదివారం చేరారు. సబితా ఇంద్రారెడ్డి అనుచరులైన చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ సబితా ఇంద్రారెడ్డి పిలుపు తో బిఆర్ఎస్ లో చేరినట్టు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన చెక్కల ఎల్లయ్య, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీలో ఇమడలేక బిఆర్ఎస్ పార్టీలో చేరారు. చెక్కల చంద్రశేఖర్ పెద్దషాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, ప్రమోద్ పటేల్సొసైటీ డైరెక్టర్, కంకరి నరసింహసొసైటీ డైరెక్టర్, తాళపల్లి గణేష్ మాజీ ఎంపిటిసి ఇస్రా నాయక్ మాజీ సర్పంచ్ గోపాల్ నాయక్ మాజీ ఎంపిటిసి బొద్దం నారాయణ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ కేశంపేట మహేష్ యాదవ్ మాజీ ఉప సర్పంచ్ సురేష్ నాయక్, తదితరులు పార్టీలో చేరారు.

## దుకాణ అనుమతికి డబ్బులు ఇవ్వాల్సిందేనంట ?




**షాద్ నగర్, మహా:** దీపావళి పర్వదినం వచ్చిందంటే చాలు అంతా ఆ అధికారి చేతిలోనే ఉంటుంది. దీపావళి పటాకుల వ్యాపారానికి సంబంధించి చిన్న వ్యాపారాల నుంచి తప్పకుండా ఫైర్ స్టేషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ షాద్ నగర్ పట్టణంలో ఇందుకు విరుద్ధంగా ఉంటుంది. అంతా అధికారి చేతిలో ఉండడంతో అనుమతి తీసుకుని ఏర్పాటు చేసే పటాకుల దుకాణాలు కొన్ని అయితే అనుమతి లేకుండా ఏర్పాటు చేసే దుకాణాలు మరెన్నో ఉన్నాయి. ఒక్కో దుకాణా ఏర్పాటుకు డబ్బులు ఇవ్వాల్సిందేనంట ?. ఇప్పటివరకు షాద్ నగర్ 12 దుకాణాలకు మాత్రమే అనుమతి ఇచ్చారంట. మరోవైపు ఒక్క దుకాణానికి అనుమతి తీసుకొన్న వారే మరికొన్ని దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. చిన్న ప్రమాదం జరిగిన భారీ స్థాయిలో నష్టం జరిగే ప్రమాదం తప్పదు. ప్రమాద హెచ్చరికలు, పరిశీలన శూన్యమని, చర్యలు తీసుకోవాల్సిన అధికారులే చోద్యం చూస్తున్నారు. షాద్నగర్ పట్టణంలో ఏర్పాటు చేస్తే పటాకుల దుకాణాలకు సంబంధించిన వివరాలకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ను సంప్రదించగా ఏ డి ఎఫ్ ఓ వద్ద వివరాలు ఉంటాయని ఈ విషయమే ఆయనను సంప్రదించగా ఆయన షాద్నగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వద్ద ఉంటాయని ఒకరిపై ఒకరు మాట దాటేస్తున్నారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ పటాకుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించగా మాకు ఎలాంటి సంబంధం లేదు స్థానిక పోలీసులు చూసుకుంటారని చెప్తున్నారు. ప్రతి సంవత్సరం దీపావళి పర్వదినం వచ్చిందంటే చాలు ఈ అధికారుల హడావిడి మాత్రమే కనబడుతుంది తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆ అధికారిలపై ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.

## డిసిసి అధ్యక్ష పదవికి కాంగ్రెస్ నేతల ఏకాభిప్రాయం



**ఆమనగల్లు, మహా :** .డిసిసి అధ్యక్ష పదవి విషయంలో కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చారు. హైదరాబాద్ బాలాపూర్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఎఐసిసి పరిశీలకుడు, తమిళనాడు ఎంపీ రాబర్ట్ బ్రూస్ ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా సమావేశమయ్యారు. సమావేశానికి ఆమనగల్లు , కడ్తాల, తలకొండపల్లి మండలాల నుంచి డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న టిపిసిసి సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు భగవాన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి అంజయ్య, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమా నాయక్ లు హాజరయ్యారు. డిసిసి అధ్యక్ష పదవి విషయంలో పరిశీలకుడు ఒక్కొక్కరి అభిప్రాయ సేకరణ చేసినప్పుడు తమకు అవకాశం కల్పించకపోతే బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ కు అవకాశం కల్పించాలని సూచించారు. అనంతరం రాబర్ట్ బ్రూస్ కు అందరం కలిసి తమ అభిప్రాయాన్ని తెలిపినట్లు దరఖాస్తు చేసుకున్న వారు స్పష్టం చేశారు. కాగా ఆమనగలు బ్లాక్ పరిధిలోని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కూడా ఏ ఐ సిసి పరిశీల కుడికి ఏకాభిప్రాయం తెలిపినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా తెలిపారు.

## పేద ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యం



**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది.ఈ ఉచిత శిబిరంలో చల్లంపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొనగా,300 మందికిపైగా విజయవంతంగా వైద్య పరీక్షలు పూర్తి చేసి, నిపుణులైన వైద్యుల బృందంతో వారి రిపోర్ట్ మేరకు సలహాలు,సూచనలతో పాటు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సమకూర్చిన ఆర్గానిక్ హెల్త్ కిట్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా.. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ నిరుపేద ప్రజల ఆరోగ్యం పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, అందులో భాగంగానే మా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామంలో కూడా ఉచిత ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో మొబైల్ హెల్త్ క్లినిక్ సేవలతో ప్రతి కుటుంబానికి అందుబాటులోకి వెళ్తున్నామని చల్లంపల్లి గ్రామంలో మా ఐదవ క్యాంప్ నిర్వహణ చాలా సంతోషంగా ఉందని,ఇక్కడ దాదాపు 300 మంది వరకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించామని,అలాగే నిపుణులైన వైద్య బృందంతో వారికి తగిన సలహాలు సూచనలు అందిస్తూ వారికి ఆర్గానిక్ హెల్త్ కిట్స్ కూడా పంపిణీ చేశామని, ఇంత పెద్ద ఎత్తున క్యాంప్ సేవలు వినియోగించుకున్న గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలుపుతూ,మా ఉచిత మొబైల్ హెల్త్ క్లినిక్ సేవలు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్విరామంగా కొనసాగుతాయని తెలియజేశారు... ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చల్లా సురేందర్ రెడ్డి,చల్లా మాధవ రెడ్డి,గోసుల తిరుపతిరెడ్డి,పర్వతాలు యాదవ్,నాయిని నరేందర్,చల్లా అమర్నాథ్ రెడ్డి,మాలే శ్రీశైలం గౌడ్,గడ్డం వెంకటేష్,మర్ల శ్రీశైలం యాదవ్,పోతుగంటి అశోక్, మాలే రాములు గౌడ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని అందరూ పాటించాల్సిందే...

**తెలంగాణ రాష్ట్ర అఖిలభారత రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్**



**మొయినాబాద్ మహా:** భక్తి భావన కలిగి ఉన్న ప్రతి వ్యక్తి దేవుని భక్తితో కొలిచినప్పుడే అప్పుడే ఆ మానవునికి క్రమశిక్షణ ఎంతో మేలుకుతుందని అభివృద్ధి చెందుతుందని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఓ రైతు క్షేత్రంలో అయ్యప్ప మాల ధరించే భక్తుల గెట్ టుగెదర్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భాస్కర్ చారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా ముఖ్య అతిథులుగా ముదిగొండ రవి యాదవ్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆయన మాట్లాడుతూ.. భక్తి భావన కలిగి ఉన్నప్పుడే దేశంలో శాంతి భద్రతలు నెలకొల్పడం జరుగుతుందని తెలిపారు. దేవుని భక్తి ఒక వ్యక్తికే కాదు ప్రజలందరికీ ఎంతో అవసరమని సూచించారు. నేడు దీపావళి పండుగను పురస్కరించుకొని అయ్యప్ప స్వాములు కార్తీకమాసాన్ని ప్రారంభించే శుభపరిణామం అని మాల ధరించేది కార్తీక మాసంలోనే ఆరంభమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షా పదవికి నామినేషన్ దాఖలు చేసిన ధనావత్ శంకర్ నాయక్




**యాదాద్రి భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ పదవికి ధానత్ శంకర్ నాయక్ ఆదివారం నామినేషన్ వేశారు జిల్లా ఆఫీసు లో ఏఐసిసి పరిశీకులు శరత్ రౌత్, ఎమ్మెల్యేమట్ట నాగ రాగమయి, రంగనాథ్ లకు నామినేషన్ పత్రాలు సమర్పించారు అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గత 25 సంవత్సరాల నుండి పని చేస్తున్నానని గతంలో జడ్పీటీసీ, సర్పంచ్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా మరియు యాదగిరిగుట్ట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షులుగా ప్రస్తుతం తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పని చేస్తున్నాని తెలిపారు... డీసీసీ అధ్యక్షులుగా అవకాశం ఇస్తే రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడానికి, త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో అత్యధికంగా పార్టీ జడ్పీటీసీ, ఎంపిటిసి, సర్పంచ్ లు గెలిపియడానికి , తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండవసారి అధికారంలోకి రావడానికి కృషి చేస్తాన్నానని తెలిపారు ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధనావత్ భాస్కర్ నాయక్, ధ్యాప కృష్ణ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కోలుకొండ యాదగిరి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, నాయకులు నూనెముంతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## అందరి అభిప్రాయం ప్రకారమే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని ఎన్నిక

**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బైపాస్ లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో AICC పర్యవేక్షకులు శరత్ రౌత్ , సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, డిసిసి అధ్యక్షుడి ఎంపికపై నామినేషన్, అభిప్రాయ సేకరణ నిర్వహించారు ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో పాటు భువనగిరి, బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ మండలాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలు Aicc పరిశీలకులు శరత్ రౌత్ కు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలా కాకుండా అందరు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు పారదర్శకంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు DCC ఎంపిక జరుగుతుందన్నారు.. కార్యకర్తలకు,ప్రజలకు అందుబాటులో వుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతంకు కృషి చేసే నాయకున్నే అధిష్టానం ఎంపిక చేస్తుందని అన్నారు.

## ఈ నెల 23 వరకు మద్యం షాపులకు దరఖాస్తుల గడువు పొడిగింపు

**ఎక్సైజ్ కమీషనర్ హరికిరణ్**

**యాదాద్రి భువనగిరి, మహా:** బీసీ బంద్, బ్యాంకులు బంద్ లతో మద్యం షాపుకు దరఖాస్తులు వేసే ఉత్సాహకులు రాలేకపోయామనే, వారు చేస్తున్న విజ్ఞప్తి మేరకు దరఖాస్తులు స్వీకరించడానికి గడు పెంచుతున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న కలెక్టర్ల సమక్షంలో జరగాల్సిన మద్యం షాపుల డ్రా ను వాయిదా వేస్తున్నటు ఆయన తెలిపారు. ఈనెల 23 వరకు మద్యం షాపులకు దరఖాస్తులను స్వీకరించనున్నామని పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీన కలెక్టర్ల సమక్షంలో మద్యం షాపులకు డ్రాలు తీయనున్నట్లు పేర్కొన్నారు.

## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** దీపావళి పండుగను పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులందరితో కలిసి, జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, జీవితాల్లో సరికొత్త వెలుగులు చీకట్లు తొలగి, చిరు దివ్వెల వెలుగుల వలె అనునిత్యం సుఖ సంతోషాలు వెలసిల్లాలని వారు ఆకాంక్షించారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే దీపావళి పండుగను ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

## సత్తమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం

**బీర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ బీర్ల అనిత**



**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన కళ్లేపల్లి సత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులకు బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్ బీర్ల అనిత ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు..

## యాదవోంకా ఖదర్.. హైదరాబాద్ సదర్

### శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఆధ్వర్యంలో వైభవంగా కార్యక్రమం

**హాజరైన సీఎం, మంత్రులు, హరియాణా మాజీ గవర్నర్, బీజేపీ స్టేట్ చీఫ్**

**నమ్మిన వారికోసం ఎంత కష్టమొచ్చినా యాదవులు అండగా నిలబడుతారన్న రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగిన సదర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో యాదవులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారికి ప్రభుత్వంలో తగిన ప్రాతినిధ్యం, సముచిత స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ ఎన్టీఆర్ స్టేడియంలో యాదవ సోదరులు శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. నమ్మిన వారికోసం ఎంత కష్టమొచ్చినా, నష్టమొచ్చినా యాదవులు అండగా నిలబడుతారని, వారి అండతోనే హైదరాబాద్ ప్రపంచ పెట్టుబడులకు ఆదర్శ నగరంగా మారిందని ప్రశంసించారు.

**ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని..**

యాదవ సోదరుల ఖదర్ హైదరాబాద్ సదర్ అని, ఎంతో చరిత్ర కలిగిన సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరినప్పుడు వెంటనే ఆమోదించడమే కాకుండా నిధులు కేటాయించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. యాదవుల సహకారంతోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు, ఎంపీ అనిల్ కుమార్‌తో పాటు సదర్ సమ్మేళన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వారిద్దరూ విప్లవ ద్రోహులు

**మల్లోజుల, ఆశన్నలకు తగిన శిక్ష వేయాలి.. మావోయిస్టు పార్టీ పేరుతో సంచలన లేఖ**

**హైదరాబాద్, మహా :** ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయిన కీలక మావోయిస్టు నేతలు మల్లోజుల వేణుగోపాల్, తక్కళ్లపల్లి వాసుదేవరావులపై మావోయిస్టు పార్టీ తీవ్ర స్థాయిలో ఆరోపణలను గుప్పించింది. వీరిద్దరూ పోలీసులకు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సంచలన లేఖ విడుదల చేసింది. మల్లోజుల, ఆశన్నను విప్లవ ద్రోహులుగా అభివర్ణించింది. వారికి ప్రజలే తగిన శిక్ష విధించాలని, తన్ని తరిమేయాలని పలుపు నిచ్చింది. పార్టీ కేంద్ర కమిటీతో చర్చించకుండానే వారిద్దరు లొంగిపోయారని ఆరోపించింది. వారిద్దరినీ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపింది. ప్రాణభీతి ఉన్నవారెవరైనా లొంగిపోవచ్చు కానీ ఆయుధాలు మాత్రం అప్పగించకూడదని కోరింది. శత్రువులు ఎదుట లొంగిపోయిన వారిద్దరికి తగిన శిక్ష ప్రజలే విధిస్తారని సంచలన వ్యాఖ్యలు చేసింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అధికార ప్రతినిధి అభయ్ పేరుతో నాలుగు పేజీల లేఖ విడుదల చేసింది. కేంద్ర కమిటీతో చర్చించకుండానే మల్లోజుల, ఆశన్న వారి అనుచరులతో కలిసి లొంగిపోయారని లేఖలో పేర్కొంది. వారిని విప్లవ ద్రోహులుగా, పార్టీ విచ్ఛిన్నకారులుగా, విప్లవ ప్రతిఘాతకులుగా అభివర్ణించింది. శత్రువులకు లొంగిపోయిన మల్లోజుల, ఆశన్న బృందాలను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వెల్లడించింది. కాగా 2 రోజుల్లో 258 మంది లొంగిపోయారని అమిత్ షా ట్వీట్ చేసిన నేపథ్యంలో ఈ లేఖ కలకలం సృష్టిస్తోంది. 2011 చివరి నుంచి విప్లవోద్యమం గడ్డు స్థితిని ఎదుర్కొంటూ వస్తోంది. 2018లో మవోయిస్టు పార్టీ ఒకసారి తాత్కాలిక వెనుకంజ వేసింది. అప్పటి నుంచి మల్లోజుల బలహీనతలు బయటపడ్డాయి. 2020 కేంద్ర కమిటీ సమావేశంలో మల్లోజుల దండకారణ్య విప్లవాచరణలోని కొన్ని లోపాలపై సొంత విశ్లేషణలతో నిర్ధారించి ఒక పత్రాన్ని ప్రవేశ పెట్టాడు. దాన్ని కేంద్ర కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత ఎప్పటికప్పుడూ జరిగిన కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో.. ఆయన తప్పుడు రాజకీయ భావనలను పార్టీ విమర్శించింది. అనంతరం ఆయన్ను పార్టీ సరిదిద్దడానికి కృషి చేసింది. 2011లో జరిగిన దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ప్లీనం మల్లోజుల వ్యక్తివాదాన్ని, అహంభావాన్ని, తీవ్రమైన పెద్దతందారీ తనాన్ని విమర్శించి వాటిని సరిదిద్దుకోవాలని కోరింది. అయితే, 2025 మే నెలలో జరిగిన ఆపరేషన్ కగార్ దాడిలో మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు అమరత్వం తర్వాత మల్లోజులలో దీర్ఘకాలంగా ఉన్న సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ బలహీనతలు గుణాత్మక మార్పును సంతరించుకుని శత్రువు ముందు మోకరిల్లేలా చేశాయి" అని అభయ్ లేఖలో పేర్కొన్నాప. "విప్లవానికి ద్రోహులుగా మారిన మల్లోజుల, ఆశన్నల ముఠా సరైన మార్గంలో విప్లవ ఉద్యమాన్ని పునర్మిస్తామనడం బూటకం. వాళ్లు కేంద్ర, రాష్ట్ర ఇంటజిజెన్స్ ఏజెన్సీల నియంత్రణలో ఉంటూ చేసే ప్రజా పోరాటాలు, నిర్మించే విప్లవ ఉద్యమం ప్రభుత్వ ప్రాయోజిత ప్రజా పోరాటాలుగా, విప్లవ ఉద్యమంగానే ఉంటాయి. అందుకే ఈ విప్లవ ద్రోహులు ప్రజాపోరాటాల పేరుతో ప్రజల వద్దకు వస్తే వారిని తన్నితరమాల్సిందిగా పిలుపునిస్తున్నాం. కగార్ యుద్ధంతో ప్రాణభీతి ఉన్నవారు ఎవరైనా లొంగిపోతే లొంగిపోవచ్చు కానీ పార్టీకి, విప్లవ ప్రజలను చెందిన ఆయుధాలను శత్రువుకు అప్పగించకూడదని కోరుతున్నాం. అది విప్లవ ద్రోహమే కాకుండా విప్లవ ప్రతిఘాతకత అవుతుంది. విప్లవ ప్రతిఘాతకులను.. విప్లవ ప్రజలు శిక్షించక తప్పదు" అని లేఖలో అభయ్ హెచ్చరించారు.

# డిజిటల్ అరెస్టు పేరుతో టీడీపీ ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్ళ బురిడీ

### మానీలాండరింగ్ కు పాల్పడ్డారంటూ రూ. 1.07 కోట్లు కొట్టేసిన కేటుగాళ్ళు

### హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఎమ్మెల్యే ఫిర్యాదు

**హైదరాబాద్, మహా :** డిజిటల్ అరెస్టు పేరుతో తెలుగు దేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే నుంచి సైబర్ నేరగాళ్ళు రూ.1.07 కోట్లు కొల్లగొట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నుంచి అందిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో ఉన్న సమయంలో ఘటన జరిగినట్లుగా ఫిర్యాదులో పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నట్లు సైబర్ క్రైం పోలీసులు చెప్పారు. 'డిజిటల్ అరెస్టు' పేరుతో ఎమ్మెల్యేను మోసం చేసిన ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అసలు 'డిజిటల్ అరెస్టు' అనేది ఉండదని పోలీసుశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. కానీ, మోసాలు మాత్రం ఆగడం లేదు. పుట్టా సుధాకర్ యాదవ్ ఏపీలోని కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్‌గానూ పనిచేశారు. ఈయన కుమారుడు పుట్టా మహేష్ కుమార్ ప్రస్తుతం ఏపీలోని ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా ఉన్నారు. సుధాకర్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉంటున్నారు. ఈ నెల 16న సైబర్ క్రైం పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 10వ తేదీన సుధాకర్ యాదవ్‌కు ముంబయి సైబర్ క్రైం బ్రాంచ్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ గౌరవ్ శుక్లా పేరుతో కాల్ వచ్చింది. ''ముంబయిలో మనీ లాండరింగ్ కింద కేసు నమోదైనట్లుగా బెదిరించారు. నకిలీ ఆధార్, సిమ్ కార్డులతో బ్యాంకు అకౌంట్లు తెరిచి మనీలాండరింగ్‌కు పాల్పడినట్లుగా ఫోన్‌లో చెప్పారు.




సుధాకర్ యాదవ్ పేరుతో కొనుగోలు చేసిన సిమ్ కార్డుతో అక్రమంగా లావాదేవీలకు పాల్పడినట్లుగా బెదిరించారు'' అని సుధాకర్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు చెప్పారు. 'ఆ తర్వాత సైబర్ క్రైం అధికారి విక్రమ్ అని పరిచయం చేసుకున్న మరో వ్యక్తి సీబీఐ అరెస్టు వారెంట్ వచ్చినట్లుగా వీడియో కాల్ ద్వారా చూపించారు' అని ఫిర్యాదులో తెలిపారు. ''నకిలీ అకౌంట్లను సీబీఐ ఫ్రీజ్ చేసిందని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు.. సుధాకర్ యాదవ్ పేరుతో రూ.3 కోట్లను మనీలాండరింగ్ కింద వేరొక బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించారని చెబుతూ బెదిరింపులకు దిగారు. విచారణకు సహకరించకపోతే అరెస్టు చేస్తామని భయపెట్టారు'' అని పోలీసులు చెప్పారు. సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి, తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలుగుతుందనే భయంతో అక్టోబరు 10 నుంచి 15వ తేదీ మధ్య రూ. కోటి ఏడు లక్షలను సైబర్ నేరగాళ్ల ఖాతాలకు బదిలీ చేసినట్లుగా ఫిర్యాదులో సుధాకర్ యాదవ్ చెప్పినట్లుగా పోలీసులు తెలిపారు. ''కేసు నుంచి బయటపడేందుకు కోర్టు నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇప్పిస్తామని మరో రూ. 60 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో మోసం జరిగిందని ఎమ్మెల్యే తెలుసుకున్నారు'' అని సైబర్ క్రైం విభాగం అధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుతం కేసుపై విచారణ జరుగుతోందని పోలీసులు చెప్పారు.

**అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు**

సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు సూచిస్తున్నారు. వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా నకిలీ డాక్యుమెంట్లు చూపించి డిజిటల్ అరెస్టు అంటూ చెప్పే మాటలను నమ్మవద్దంటున్నారు. సైబర్ నేరాల గురించి సమాచారం తెలిసినా, సైబర్ నేరాల బారిన పడినా.. బాధితులు 1930 నంబరుకు వెంటనే ఫిర్యాదు చేయవచ్చని డీసీపీ దార కవిత చెప్పారు.

**పెరుగుతున్న కేసులు**

దేశంలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో 2022లో 'డిజిటల్ అరెస్టు' గురించి ప్రత్యేక ప్రస్తావన ఉండేది కాదని, ఈ తరహా మోసాలు హైదరాబాద్‌లోనూ రిపోర్టు కాలేదని డీసీపీ దారా కవిత చెప్పారు. అయితే, 2023 నుంచి డిజిటల్ అరెస్టు మోసాలు నమోదవుతున్నట్లు ఆమె వివరించారు. ''హైదరాబాద్ సైబర్ క్రైం విభాగం పరిధిలో 2023లో 42 కేసులు, 2024లో 354 కేసులు రిపోర్టు అయ్యాయి. 2025లో ఇప్పటివరకు 42 కేసులు నమోదయ్యాయి'' అని డీసీపీ తెలిపారు. దేశంలో డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతున్న 1,700కు పైగా స్కైప్ ఐడీలు, 59వేల వాట్సాప్ అకౌంట్లను ఇండియన్ సైబర్ క్రై కోఆర్డినేషన్ సెంటర్(14సీ) బ్లాక్ చేసినట్లుగా నిరుడు డిసెంబరులో పీఐబీ వెల్లడించింది. గత ఏడాది నవంబరు 15 నాటికి 6.69 లక్షల సిమ్ కార్డులు, 1.32 లక్షల ఐఎంఈఐ నంబర్లను పోలీసుల నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం బ్లాక్ చేసింది. అయినప్పటికీ ఐడీలు మార్చి డిజిటల్ అరెస్టు మోసాలకు సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు.

## 11కు తగ్గిన నక్సల్స్ ప్రభావిత జిల్లాలు

**నక్సల్స్ రహిత మారిన జిల్లాలకు మహర్దశ.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో దేశంలో మావోయిస్టు ప్రభావం తగ్గిందని, మార్చి 31 నాటికి నక్సల్స్ నిర్మూలన పూర్తి స్థాయిలో జరుగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మార్చి 31, 2026 నాటికి దేశంలో నక్సలిజం హింసను పూర్తిగా నిర్మూలించేందుకు మార్గం సుగమం అవుతోందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' లో భాగంగా వందలాదిమంది నక్సలైట్లు ముందుకు వచ్చి హింసా మార్గాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోవడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు. ఆదివారం హైదరాబాద్ లో కిషన్ రెడ్డి నక్సల్స్ అంశం, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి గురించి మాట్లాడారు. 'గత మూడు రోజులలోనే 300 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారు. పెద్ద ఎత్తున నక్సలైట్లు లొంగిపోవడం, అందులో ఎక్కువమంది తెలుగువారు ఉండటం ప్రత్యేక విషయం. ఇంతకాలం నక్సలిజం కారణంగా అనేక జిల్లాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండగా, నేడు దేశమంతా దీపావళి వేడుకలు జరుపుకుంటున్న సమయంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు చీకటి నుంచి వెలుగు వైపు అడుగులు వేస్తుండటం చాలా సంతోషించదగ్గ విషయం.' అని కిషన్ రెడ్డి అన్నారు.

ప్రభుత్వం చేపట్టిన చర్యలతో దశాబ్దం క్రితం దేశంలో 125గా ఉన్న నక్సల్ ప్రభావిత జిల్లాలు.. నేడు 11కు తగ్గాయి. మిగిలిన ఈ 11 జిల్లాలు కూడా త్వరలోనే నక్సల్ రహిత జిల్లాలుగా మారతాయని ఆశిద్దాం అని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు. 'అంబేద్కర్ గారి రాజ్యాంగంలో హింసకు చోటు లేదు. అహింసా మార్గంలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకోవచ్చు. రక్తపాతం ద్వారా, హింస ద్వారా ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏమీ సాధించలేరనే సందేశం మరోసారి స్పష్టమయ్యింది.' అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. 'నక్సలైట్ల కారణంగా ఇంతకాలం ఆ ప్రాంతాలు (నక్సల్స్ ప్రభావిత) రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రుల నిర్మాణానికి కూడా నోచుకోలేదు. కనీస మౌలిక వసతులు లేకుండా ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యాయి, నేడు నక్సల్ రహితంగా మారిన ఆయా జిల్లాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది.' అని చెప్పారు.






డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్ (HYD) ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆఫ్ జర్నలిజం ఇన్ ది ఏఐ ఎరా' అనే అంశంపై నేషనల్ సెమీనార్ జరిగింది. ఈ సెమినార్‌లో నేను.. 'జర్నలిజంలో AGI (ఆర్టిఫిషల్ జనరల్ ఇంటలిజెన్స్) - అవకాశాలు, సవాళ్లు' సబ్జెక్టుపై ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా. - స్వామి ముద్దం

## పారా త్రోబాల్ ప్లేయర్‌కు కేటీఆర్ భరోసా..!




రాజన్న సిరిసిల్ల జిల్లా, చంద్రంపేట గ్రామానికి చెందిన పారా త్రోబాల్ ప్లేయర్ మిట్టపల్లి అర్చన, స్వతహాగా ఎదిగి ఖేలో ఇండియా, నేషనల్ లెవెల్ పారా త్రోబాల్ స్థాయిలో సత్తా చాటి ఇప్పుడు ఇండియా తరపున తెలంగాణ నుంచి శ్రీలంకలో పారా త్రోబాల్ ఆడడానికి అర్హత సాధించారు. పేద కుటుంబానికి చెందిన అర్చనకు చిన్నతనం నుంచే క్రీడలంటే ఆసక్తి. అద్దె ఇంట్లో ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ తనకు ఇష్టమైన ఆటలో గెలుపే లక్ష్యంగా కృషిచేస్తున్నారు. ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడం సోషల్ మీడియా ద్వారా తెల్సుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. తనకు భరోసా ఇచ్చి క్రీడా పరికరాలు, ఆర్థిక సహాయం చేసి మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారని అంటున్నారు పారా త్రోబాల్ ప్లేయర్ మిట్టపల్లి అర్చన. ఈ విషయాన్ని 'ఎక్స్'లో బీఆర్ఎస్ పార్టీ స్పష్టం చేసింది. 'రామన్న అంటేనే ఒక భరోసా.. సామాన్యులకు కొండంత అండ' అని బీఆర్ఎస్ పేర్కొంది.

# ఎల్లప్పుడూ రైతన్నకు అండగా నిలవాలి

### సరిహద్దుల విషయంలో ఏ ఒక్కరూ ఇబ్బంది పడొద్దు

- రైతు రాజు కావాలంటే మీరు చేసే పనుల్లో నిజాయితీ ఉండాలి
- భూ యజమానుల సరిహద్దులను పరిరక్షించే బాధ్యత మీపై పెట్టాం
- 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుదాం: సీఎం రేవంత్
- శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లను పంపిణీ చేసిన రేవంత్, పొంగులేటి



**హైదరాబాద్, మహా:** రైతులకు అండగా ఉంటూ వారికి సంబంధించిన భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాల్సిన గురుతరమైన బాధ్యత లైసెన్స్ పొందిన సర్వేయర్లపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. లైసెన్స్ పొందిన సర్వేయర్లు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో లైసెన్స్ సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఎల్లప్పుడూ రైతులకు అండగా నిలవాలి. రైతు రాజు కావాలంటే మీరు చేసే పనుల్లో నిజాయితీ ఉండాలి. రైతుకు అన్యాయం చేస్తే మన కుటుంబ సభ్యులకు అన్యాయం చేసినట్టే. మీరంతా కష్టపడితే తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరొస్తుంది. ఆ గురుతరమైన బాధ్యత మీ భుజస్కంధాలపై పెట్టి గ్రామాలకు, తండాలకు పంపిస్తున్నామని' అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన 1 కోటి 60 లక్షల ఎకరాల భూములు యజమానుల వద్ద ఉందని, 140 సంవత్సరాలుగా వివిధ చట్టాలు అమలులోకి వచ్చినప్పటికీ సమస్యలు ఇంకా పరిష్కారం లభించలేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 'సరిహద్దుల విషయంలో ఏ రైతు కూడా పరిష్కారం కాకుండా ఇబ్బంది పడొద్దని మిమ్మల్ని నియమించడం జరిగింది. తెలంగాణ ప్రజలకు కన్న తల్లిపై ఎంత మమకారం చూపిస్తారో గ్రామంలో తమ భూమి మీద అదే మమకారం చూపిస్తారు. భూయజమానుల సరిహద్దులను పరిరక్షించే బాధ్యత మీపై పెట్టాం. దేశంలోనే మొదటి స్థానంలో ఉండే విధంగా ఒక అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ సంకల్పానికి మీరంతా సహకరించాలి. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రణాళికలు రచించుకోవాలని తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకు వెళుతున్నాం. మీరంతా విజన్‌లో భాగస్వాములు కావాలి. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యం చేరుకోవాలంటే మీ సహకారం ఉండాలి" అని కోరారు.



## యూఏఈ రూల్... ఎంత బంగారానికి డిక్లేర్ అవసరం..

భారతీయులకు బంగారం అంటే చాలా ఇష్టం. ఈ కారణంగానే ఎప్పటికప్పుడు, ఎక్కడికి వెళ్లినా గోల్డ్ కొనేస్తూ ఉంటారు. ఇంకొందరైతే గోల్డ్ కొనుగోలు చేయడానికి ప్రత్యేకించి.. అరబ్ దేశాలకు వెళ్తున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) నిబంధనల ప్రకారం.. భారతీయ ప్రయాణికుల వద్ద ఎంత విలువైన బంగారం ఉంటే డిక్లేర్ చేయాలి అనే విషయాన్ని తెలుసుకుందాం. భారతీయులు యూఏఈ (UAE)కి ప్రయాణించే సమయంలో తమ వద్ద ఉన్న బంగారం విలువ రూ.13.5 లక్షల(AED 60,000)కు మించి ఉంటే, దానికి డిక్లేర్ (declare) చేయాల్సి ఉంటుంది. అంటే, మీరు వెంట తీసుకెళ్లే బంగారం విలువ.. ఈ పరిమితికి మించి ఉంటే, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. పరిమితికి మించి బంగారం తీసుకెళ్లడానికి లీగల్‌గా ఎలాంటి అనుమతి ఉండదు. కాబట్టి దీనికి ట్యాక్స్, డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. వివాహాలు, పండుగలు లేదా గిఫ్ట్ రూపంలో..సాంప్రదాయకంగా బంగారు ఆభరణాలను తీసుకెళ్లే భారతీయ పర్యాటకులు, NRIలు, వ్యాపార ప్రయాణికులు ఆ విషయాన్ని తప్పకుండా గమనించాలి. బంగారం అక్రమ రవాణాను తగ్గించేందుకు, ట్యాక్స్ ఎగవేతను అడ్డుకునేందుకు ఈ నిబంధనను అమలు చేస్తున్నారు. డిక్లేర్ చేయకుండా ఎక్కువ బంగారం తీసుకెళితే, దానిని సీజ్ చేయవచ్చు. లేదా మీకు భారీ జరిమానా పడవచ్చు లేదా జైలుశిక్షను కూడా అనుభవించాల్సి ఉంటుంది.

## ఫన్ అండ్ ఫవర్‌ఫుల్ టీవీ!



ఇంట్లో కుటుంబం మొత్తానికి ఆనంద కేంద్రం టీవీ. కాని, దాని వలన ఎక్కువసార్లు సంతోషం కంటే సమస్యలే ఎదురవుతాయి. ఇప్పుడు ఈ చిన్న చిన్న సమస్యలకు పరిష్కారం ఇచ్చే అద్భుతమైన గాడ్జెట్లు ఇవీ!

**కామ్‌గా చూడొచ్చు!**

రాత్రి హాయిగా పిల్లలు పడుకొని ఉంటే, అప్పుడే పేరెంట్స్ 'ఇప్పుడు మనం ప్రశాంతంగా సినిమా చూడొచ్చు' అనుకుంటారు. కాని, టీవీలో వచ్చే ఒక్క మాస్ సీన్ సౌండ్‌తో మొత్తం ఇంటి సీనే రివర్స్ అవుతుంది. ఇలాంటి పరిస్థితి రాకుండా, బ్లూటూత్ అడాప్టర్‌తో టీవీని హెడ్‌సెట్ సాయంతో చూడవచ్చు. దీనిని టీవీకి జత చేస్తే, ఇక మీరు ఏ హెడ్‌సెట్‌నైనా కనెక్ట్ చేసుకునే వీలుంటుంది. ఒకేసారి నాలుగు హెడ్‌సెట్లను కూడా కనెక్ట్ చేసుకోవచ్చు. అలా మీరు సీరియస్‌గా సీరియల్ లేదా సినిమా చూస్తున్నప్పుడు పక్కన వాళ్లని 'షుష్..' అని చెప్పాల్సిన అవసరం లేదు. బటన్లతో వాల్యూమ్‌ను తక్కువ లేదా ఎక్కువ చేయడం సులభం. ధర రూ. 1,799 మాత్రమే!


**అన్ని పరికరాకలకూ ఒక్కటే రిమోట్**

సోఫాలో హాయిగా కూర్చుని, పక్కన స్నాక్స్ పెట్టుకుని, ఫ్యామిలీతో సినిమా చూడటానికి సిద్ధమయ్యే క్షణంలో 'రిమోట్ ఎక్కడ?' అనే ప్రశ్న! ఆ తర్వాత ఏసీ ఆన్ అవ్వకపోయినా, సెటప్‌బాక్స్ సిగ్నల్ రాకపోయినా, సేమ్ ప్రశ్నే రిపీట్! ఇలా పలు రకాల రిమోట్ల కోసం అవసరం లేకుండా చేస్తుంది. 'సోఫా బటన్ ఎక్స్‌వన్ యూనివర్సల్ రిమోట్'. ఇది ఒక్కటి ఉంటే చాలు, అన్ని పరికరాల రిమోట్లకు గుడ్‌బై చెప్పేయొచ్చు. టీవీ, ఏసీ, సెటప్ బాక్స్, లైట్స్ అన్నీ ఒక్క బటన్తోనే నియంత్రించవచ్చు. వాయిస్ కంట్రోల్‌తో కూడా ఆపరేట్ చేయవచ్చు. అంటే చేతులు బిజీగా ఉన్నపుడు 'రిమోట్, టీవీ ఆన్ చేయి' అని చెప్తే చాలు, వెంటనే చేసేస్తుంది. ఇన్ఫ్రారెడ్ కనెక్టివిటీతో అతి తక్కువ సమయంలో సులభంగా అమర్చుకోవచ్చు. ఒకేసారి ఐదు లక్షల పరికరాల వరకు కనెక్ట్ చేసుకునే వీలుంది. ధర రూ. 3,999 మాత్రమే!

**ఎక్కడినుంచైనా చూడొచ్చు!**

ఇక టీవీ చూడటానికి మెడ తిప్పే రోజులు పోయాయి! వంటగదిలో ఉన్నా, హాల్లో ఉన్నా, టీవీనే మీ వైపు తిరిగి 'కనిపిస్తునున్నానా, ఇంకొంచెం జరగాలా?' అంటుంది. ఇదే 'రోబోస్టు టీవీ వాల్ మౌంట్ బ్రాకెట్' మ్యాజిక్. గోడపై తిప్పుతూ, వంచుతూ, టీవీని మీ చూపు కోణానికి సరిపడేలా సర్దేస్తుంది. ఇక వంట చేసేటప్పుడు సీరియల్ మిస్ కానివ్వదు, క్రికెట్ స్కోర్ కూడా బాల్కనీలో కాఫీతో కలిపి చూడొచ్చు. చిన్న నుంచి పెద్ద వరకు ఏ టీవీ అయినా, ఇది తన భుజాల మీద సేఫ్‌గా మోస్తుంది. మెటల్ బాడీ, తుప్పు, ధూళి భయం లేదు. ఇన్స్టాలేషన్ కూడా చాలా సులభం. ధర కేవలం రూ. 568 మాత్రమే!

## పెరిగిన యస్ బ్యాంక్ లాభం: రూ. 654 కోట్లు




ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ నికర లాభం రూ. 654 కోట్లకు చేరింది. గత క్యూ2లో నమోదైన రూ. 553 కోట్లతో పోలిస్తే 18 శాతం పెరిగింది. ఇక లోన్‌బుక్ 6.4 శాతం వృద్ధి చెందడంతో కీలకమైన నికర వడ్డీ ఆదాయం 0.10 శాతం మెరుగుపడి 4.6 శాతానికి చేరింది. ఇతర ఆదాయం 16.9 శాతం పెరిగి రూ. 1,644 కోట్లుగా నమోదైంది. తాజా స్లిప్పేజీలు అంతక్రితం త్రైమాసికంలో ఉన్న రూ. 1,458 కోట్ల నుంచి రూ. 1,248 కోట్లకు దిగివచ్చాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి పెద్దగా మార్పు లేకుండా 1.6 శాతం స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10 శాతం స్థాయి రుణ వృద్ధి సాధించాలని నిర్దేశించుకున్నట్లు బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ చెప్పారు. ఇకనుంచి నికర వడ్డీ మార్జిన్లు మరింత మెరుగుపడగలవని ఆయన పేర్కొన్నారు. జపాన్ దిగ్గజం ఎస్ఎంబీసీ 24 శాతం పైగా వాటాను కొనుగోలు చేసినప్పటికీ, తక్షణమే వ్యాపార ప్రణాళికల్లో మార్పులేమీ ఉండబోవని కుమార్ వివరించారు. భవిష్యత్ ప్రణాళికలను నిర్దేశించే వార్షిక సర్వసభ్య సమావేశం యథా ప్రకారంగానే జరుగుతుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 80 శాఖలను ప్రారంభించే ప్రణాళికలు ఉన్నట్లు వివరించారు.

## ఐసీఐసీఐ బ్యాంక్ లాభం.. 3 నెలల్లో రూ. 12359 కోట్లు





ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ లాభం 3.2 శాతం పెరిగి (కన్సాలిడేటెడ్) రూ. 13,357 కోట్లకు చేరింది. ప్రొవిజనింగ్ తగ్గడమనేది మార్జిన్ క్షీణత ప్రభావాలను అధిగమించేందుకు తోడ్పడింది. స్టాండెలోన్ ప్రాతిపదికన లాభం రూ. 11,746 కోట్ల నుంచి 5 శాతం వృద్ధితో రూ. 12,359 కోట్లకు చేరింది. మరోవైపు, 10.6 శాతం రుణాల వృద్ధి దన్నుతో కీలకమైన నికర వడ్డీ ఆదాయం 7.4 శాతం పెరిగి రూ. 21,529 కోట్లకు చేరింది. అయితే, నికర వడ్డీ మార్జిన్ మాత్రం 4.36 శాతం నుంచి 4.30 శాతానికి పరిమితమైంది. రాబోయే రోజుల్లో నికర వడ్డీ మార్జిన్లు స్థిర శ్రేణిలో తిరుగాడవచ్చని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ గానీ నగదు నిల్వల నిష్పత్తిని తగ్గిస్తే ఇది మెరుగుపడొచ్చని, పోటీ తీవ్రత వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపొచ్చని పేర్కొన్నారు. చిన్న వ్యాపార సంస్థల రుణాల నాణ్యత దిగజారే అవకాశాలపై స్పందిస్తూ.. బిజినెస్ బ్యాంకింగ్ సెగ్మెంట్లో రుణాల పరిస్థితి మెరుగ్గానే ఉందని బాత్రా చెప్పారు. అందుకే ఆ విభాగానికి రుణాలను పెంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో రిటైల్ రుణాలు సహా క్రెడిట్ వృద్ధి పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశీ కార్పొరేట్ల వద్ద పుష్కలంగా నిధులున్నాయని, రుణాలను సమకూర్చుకునేందుకు ఇతరత్రా మార్గాలు కూడా ఉన్నాయని బాత్రా చెప్పారు.

**ఆర్థిక ఫలితాల్లో ఇతర ముఖ్యాంశాలు..**

క్యూ2లో వార్షిక ప్రాతిపదికన రూ. 1,233 కోట్ల నుంచి, త్రైమాసికాలవారీగా రూ. 1,815 కోట్ల నుంచి ప్రొవిజనింగ్ రూ. 914 కోట్లకు తగ్గింది. స్థూల మొండిబాకీలు (జీఎన్‌పీఏ) రూ. 5,073 కోట్ల నుంచి స్వల్పంగా రూ. 5,034 కోట్లకు తగ్గాయి. జీఎన్‌పీఏ నిష్పత్తి 1.97 శాతం నుంచి 1.67 శాతానికి తగ్గింది. డిపాజిట్ వృద్ధి 9.1 శాతంగా ఉంది. రిటైల్ రుణాలు 6.6 శాతం పెరిగాయి. మొత్తం లోన్ బుక్‌లో వీటి వాటా 52.1 శాతంగా ఉంది. బిజినెస్ బ్యాంకింగ్ పోర్ట్‌ఫోలియో 24.8 శాతం వృద్ధి చెందింది. కార్పొరేట్ రుణాలు 3.5 శాతం పెరిగాయి. క్యాపిటల్ అడెక్వసీ 17.31 శాతంగా ఉంది. ట్రెజరీ లావాదేవీలు మినహా వడ్డీయేతర ఆదాయం 13.2 శాతం పెరిగి రూ. 7,356 కోట్లుగా నమోదైంది. ట్రెజరీ ఆదాయం మాత్రం రూ. 680 కోట్ల నుంచి ఏకంగా రూ. 220 కోట్లకు పడిపోయింది.

# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



### రాయల్ టైటిల్ వదులుకున్న ప్రిన్స్ ఆండ్రూ

**లండన్:** బ్రిటన్‌రాజు చార్లెస్-3 తమ్ముడు ప్రిన్స్ ఆండ్రూ(65) తన రాయల్ టైటిల్ 'డ్యూక్ ఆఫ్ యార్క్'ను వదులుకున్నారు. ఇకపై అన్ని రాచ బిరుదులను, మర్యాదలను సైతం వదిలేసు కుంటున్నట్లు ఆండ్రూ ఎక్స్ వేదికగా ప్రకటించారు. అమెరికాను కుదిపేసిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంతో ప్రిన్స్ ఆండ్రూకు సంబంధాలున్నట్లు ఇటీవల తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాజ కుటుంబం నుంచి వస్తున్న ఒత్తిడుల మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన హిజ్ రాయల్ హైనెస్ (హెచ్‌ఆర్‌హెచ్)ను వాడటం ఆపేశారు.

## హమాస్ మరో డేంజర్ ప్లాన్.. అమెరికా సీరియస్ వార్నింగ్



**వాషింగ్టన్:** గాజాలోని పౌరులపై దాడులు చేసేందుకు హమాస్ ప్రణాళికలు రచిస్తోందని కలకలం రేపింది. హమాస్ దాడుల ప్రణాళిక గురించి తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉందని అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో, రంగంలోకి దిగిన అమెరికా.. హమాస్‌కు హెచ్చరికలు జారీ చేసింది. ఇలాంటి చర్యలకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చింది. ఇజ్రాయెల్‌హమాస్ మధ్య సుదీర్ఘ యద్ధం జరిగిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవతో ఇజ్రాయెల్ హమాస్ (Israel Hamas)ల మధ్య ఇటీవల కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా ఇజ్రాయెల్ బందీలను సైతం హమాస్ విడుదల చేసింది. అయితే, గాజాలోని పౌరులపై దాడులు చేసేందుకు హమాస్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం బయటకు రావడం తీవ్ర కలకలం రేపింది. ఈ సందర్భంగా అమెరికా (USA) విదేశాంగ శాఖ అలర్ట్ అయ్యింది. పాలస్తీనా పౌరులపై హమాస్ దాడి ప్రణాళిక.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని అమెరికా పేర్కొంది. తమ మధ్యవర్తిత్వ ప్రయత్నాలతో సాధించిన గణనీయమైన పురోగతిని ఇది దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. హమాస్ ఈ దాడులకు పాల్పడితే.. గాజా ప్రజలను రక్షించడానికి, కాల్పుల విరమణ సమగ్రతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తమకు అందిన ఈ సమాచారాన్ని ఈజిప్టు, ఖతార్, తుర్కియేతో సహా శాంతి ఒప్పందానికి హామీగా ఉన్న దేశాలకు తెలియజేసినట్లు యూఎస్ తెలిపింది. దీంతో, మరోసారి గాజాలో ఉద్రిక్త పరిస్థితులు ఉంటాయా అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

## పాక్-ఆఫ్ఘన్ మధ్య కీలక చర్చలు.. శాంతికి ఓకే



**దోహా:** కొద్ది రోజులుగా పాకిస్తాన్‌ఆఫ్ఘనిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఖతార్, తుర్కియే మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య శాంతి చర్యలు ఫలించాయి. పాక్‌ఆఫ్ఘన్ తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ మేరకు ఖతార్ విదేశాంగ మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో రెండు దేశాల సరిహద్దులో దాడులు నిలిచిపోనున్నాయి. ఖతార్ రాజధాని దోహా వేదికగా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య శాంతి చర్చలు జరిగాయి. ఈ చర్చలకు ఖతార్, తుర్కియే (Turkey) మధ్యవర్తిత్వం వహించాయి. చర్చల్లో పాల్గొనేందుకు ఇరుదేశాలకు చెందిన రక్షణ మంత్రులు ఖతార్ వచ్చారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణకు సంబంధించి కీలకంగా చర్చించారు. రెండు దఫాలుగా జరిగిన ఈ చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. దీంతో, శాంతి చర్చలు ఫలించాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన స్థిరత్వాన్ని కొనసాగించడంపై రానున్న రోజుల్లో మరిన్ని చర్చలు జరిపేందుకు కూడా వారు అంగీకరించారని ఖతార్ వెల్లడించింది. ఈ మేరకు ఖతార్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్వయంగా ఓ ప్రకటనలో వివరాలను వెల్లడించింది. ఇక, శుక్రవారం అర్ధరాత్రి ఆఫ్ఘనిస్థాన్‌లోని పాక్టికా ప్రావిన్స్‌పై పాక్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. పాక్ చేసిన దాడుల్లో యువ క్రికెటర్లు, మహిళలు, చిన్నారులతో సహా కనీసం 10 మంది మృతి చెందారు. ఈ క్రమంలో పక్క దేశం నుంచి వస్తున్న దురాక్రమణలకు మాత్రమే ప్రతిస్పందిస్తున్నామన్నట్లుగా ఇరువర్గాలు వాదనలు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఆఫ్ఘన్ నుంచి వస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయడంతో పాటు సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం పునరుద్ధరణ చర్యలపై మాత్రమే దృష్టి పెట్టామని పాక్ పేర్కొంది. సరిహద్దుల్లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలను ఆఫ్ఘన్ ఖండించింది.

## సోమవారం నుంచి తెరుచుకోనున్న రఫా క్రాసింగ్




**కైరో:** గాజాకు తిరిగి వచ్చే పాలస్తీనియన్ల కోసం సోమవారం నుంచి రఫా క్రాసింగ్ పాయింట్‌ను తెరిచి ఉంచుతామని పాలస్తీనా దౌత్య కార్యాలయం తెలిపింది. గాజాకు తిరిగి వెళ్లేందుకు తమ వద్ద పేర్లు నమోదు చేయించుకున్న పాలస్తీనియన్ల సంఖ్య భారీగా ఉందని శనివారం పేర్కొంది. అయితే, ఎందరనే విషయం స్పష్టం చేయలేదు. ఈ ప్రకటనపై ఇజ్రాయెల్ ప్రభుత్వం స్పందించలేదు. యుద్ధానికి ముందు ఇజ్రాయెల్ నియంత్రణలో లేని బయటి ప్రపంచానికి గాజాకు ఉన్న ఏకైక మార్గం ఈ క్రాసింగ్. గాజాను నియంత్రణ తీసుకున్న తర్వాత 2024 మే నుంచి ఇజ్రాయెల్ దీనిని మూసివేసింది. ఇలా ఉండగా, ఇజ్రాయెల్ - హమాస్ మధ్య జరిగిన యుద్ధంలో మృతుల సంఖ్య 68 వేలు దాటిపోయిందని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. వారం క్రితం కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత మరణాల సంఖ్య పెరిగిందని పేర్కొంది. శిథిలాల తొలగింపు సందర్భంగా మృతదేహాలు బయటపడుతు న్నట్లు వెల్లడించింది.

## క్షణంలో మారిన సీన్





**పట్నా:** బీహార్‌లో నవంబర్‌లో జరగనున్న ఎన్నికల్లో తొలి దశ పోలింగ్‌నకు సంబంధించి, అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇంతలో ఒక ఉదంతం మీడియా దృష్టిని ఆకర్షించింది. భాగల్‌పూర్ బీజేపీ టికెట్ లభించకపోవడంతో కలత చెందిన మాజీ కేంద్ర మంత్రి అశ్విని చౌబే కుమారుడు అర్జిత్ శశ్వత్ చౌబే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇంతలో వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో క్షణంలో అతని నిర్ణయం మారిపోయింది. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థి అర్జిత్ శశ్వత్ చౌబే జిల్లా కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకోగానే, అతని మద్దతుదారులు అతనికి పూలమాలలు వేసి, మరింత ఉత్సాహపరిచారు. ఇంతలో శశ్వత్ చౌబే ఫోన్ రింగ్ అయ్యింది. అదే సమయంలో అతనితో మాట్లాడేందుకు విలేకరులు వేచివున్నారు. శశ్వత్ చౌబే తనకు వచ్చిన కాల్ తీసుకుని, నామినేషన్ పత్రాలను దాఖలు చేయకుండా వెనుదిరిగారు. తరువాత తాను ఊహించని విధంగా యూ టర్న్ తీసుకోవడానికి గల కారణాన్ని మీడియాకు వివరించారు. తన తండ్రి అశ్విని చౌబే సూచనల మేరకు బీజేపీలోనే ఉంటానని శశ్వత్ చౌబే స్పష్టం చేశారు. తన తండ్రి మాటను మన్నిస్తూ, ఆయనకు గౌరవాన్నిస్తూ, ఎన్నికల్లో పోటీ నుండి వైదొలగాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించగానే, బీజేపీ అగ్ర నాయకత్వం నుండి ఒత్తిడిని ఎదురయ్యిందని శశ్వత్ చౌబే పేర్కొన్నారు. 'ఈరోజు, నా తల్లిదండ్రులు నాతో మాట్లాడారు. ఇది బీజేపీ అగ్ర నాయకత్వం నుండి వచ్చిన సూచన. నేను వారికి అవిధేయునిగా ఉండలేను. నేను నా పార్టీకి, దేశానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయలేను.వారిని వ్యతిరేకించలేను' అని శశ్వత్ చౌబే మీడియాకు తెలిపారు.

## బిహార్ ఎన్నికల్లో జేఎంఎం సొంతంగా పోటీ



**రాంచీ:** బిహార్ ఎన్నికల వేళ ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) బాంబు పేల్చింది. పక్క రాష్ట్రం బిహార్‌లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్రంగా ఆరు సీట్లలో పోటీ చేయనున్నట్లు జేఎంఎం శనివారం ప్రకటించింది. అదే విధంగా, ప్రస్తుతం జార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీలతో కొనసాగుతున్న పొత్తుపై బిహార్ ఎన్నికల అనంతరం సమీక్షిస్తామని కూడా స్పష్టం చేసింది. జేఎంఎం జనరల్ సెక్రటరీ సుప్రియో భట్టాచార్య మీడియా సమావేశంలో ఈ విషయాలను ప్రకటించారు. బిహార్‌లో తమకు 12 సీట్లు కేటాయించాలని ఇండియా కూటమిని జేఎంఎం కోరింది. స్పందన లేకపోవడంతో స్వయంగా పోటీకి దిగాలని నిర్ణయించుకున్నామన్నారు.




# విదేశాల్లో స్పిరిట్

హీరో ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రం 'స్పిరిట్'. ఈ చిత్రంలో 'యానిమల్' సినిమా ఫేమ్ త్రిప్తీ దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. ప్రభాస్‌పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్న తొలి చిత్రం ఇది. డాక్టర్ పాత్రలో త్రిప్తి కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబరు చివర్లో లేదా జనవరి ప్రారంభంలో మొదలవుతుందని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా జరుగుతున్నాయట. కాగా ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించిన కొంత భాగాన్ని మెక్సికోలో జరపనున్నట్లు సందీప్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. మరి... తొలి షెడ్యూల్ షూటింగ్ మెక్సికోలోనే జరుగుతుందా? లేక హైదారాబాద్‌లోప్రారంభం అవుతుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. అలాగే ఈ సినిమా మేజర్ షూటింగ్ విదేశాల్లోనే జరుగుతుందట. ఈ చిత్రం సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ కంపోజ్ చేసిన కొన్ని ట్యూన్స్‌ను సందీప్ ఆల్రెడీ ఫైనలైజ్ చేశారని టాక్. భూషణ్‌కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించనున్న ఈ 'స్పిరిట్' సినిమా 2026 చివర్లో విడుదలయ్యే అవకాశం ఉంది. ఇక ప్రస్తుతం 'ది రాజాసాబ్, ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రా లతో ప్రభాస్ బిజీగా ఉన్నారు.

# మహేశ్ బాబుతో రాజమౌళి మైథికల్ అడ్వెంచర్ ..

ప్రపంచ సినీ వేదికపై తెలుగు సినిమాకి కొత్త పుంతలు తొక్కించిన దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. 'బాహుబలి' సిరీస్‌తో భారత సినిమాను గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టారు.'ఆర్‌ఆర్‌ఆర్'తో ఆస్కార్ దక్కేలా చేశారు. ఇక ఇప్పుడు సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి మరొక భారీ ప్రాజెక్ట్‌కి సిద్ధమవుతున్నారు. "SSMB29" గా పిలుస్తున్న ఈ సినిమా భారత సినీ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కనుందని ఇండస్ట్రీ టాక్.దుర్గా ఆర్ట్స్ పతాకంపై ఎస్.గోపాల్‌రెడ్డి ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి టెక్నీషియన్లు, యాక్షన్ స్టంట్ మాస్టర్స్, మరియు టాప్–నాచ్ VFX ఆర్టిస్టులు ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నారు. రాజమౌళి గ్లోబల్ మార్కెట్‌పై దృష్టి సారించి, హాలీవుడ్ ప్రొడక్షన్ సంస్థలతో టైఅప్‌లను కూడా ఫైనలైజ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రపంచ ప్రఖ్యాత వార్నర్ బ్రదర్స్‌తోనూ చర్చలు కొనసాగుతున్నాయట. అడ్వెంచర్ యాక్షన్ డ్రామా జానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు ఓ "గ్లోబల్ ఎక్స్‌ప్లోరర్" పాత్రలో కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరియు నటుడు మాధవన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఆఫ్రికా అడవులు, దక్షిణ అమెరికా అమెజాన్ బేసిన్, ఐస్‌లాండ్ వంటి విభిన్న లొకేషన్లలో చిత్రీకరణ జరగగా, యూనిట్ ప్రస్తుతం తదుపరి షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ఇక ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న బిగ్ అప్‌డేట్ కోసం కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తాజా సమాచారం ప్రకారం, నవంబర్ 16న రాజమౌళి "SSMB29" టైటిల్ మరియు ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయాలని నిర్ణయించారట. ఈ అప్‌డేట్‌ను హాలీవుడ్ స్థాయిలో ప్లాన్ చేసిన ఓ గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. అందులోనూ మరో సెన్సేషన్ ఏమిటంటే ఆ ఈవెంట్‌కి "అవతార్" దర్శకుడు జేమ్స్ కామెరూన్ హాజరయ్యే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్. "Avatar: Fire and Ash" ప్రమోషన్ కోసం ఇండియాకు రానున్న కామెరూన్‌తోనే గ్లోబల్ లెవల్‌లో ఈ అప్‌డేట్ విడుదల చేయించాలనే రాజమౌళి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఈ గ్లింప్స్ ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా హైప్‌కి కొత్త మైలురాయి అవుతుంది అంటున్నారు. మొత్తం మీద, "SSMB29"తో మహేశ్ బాబు, రాజమౌళి కాంబినేషన్ మరోసారి ఇండియన్ సినిమాను ఇంటర్నేషనల్ రేంజ్‌కి తీసుకెళ్లనుందనే నమ్మకం పెరిగింది






# డేట్ ఫిక్స్

ఆయుష్మాన్ ఖురానా, సారా అలీఖాన్ హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'పతీ పత్నీ ఔర్ వో దో'. ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, వామికా గబ్బి ప్రధాన పాత్రల్లో నటించారు. ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, రేణు రవి చోప్రా నిర్మించారు. కాగా, ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 4న విడుదల చేయనున్నట్లుగా శనివారం మేకర్స్ ప్రకటించారు. ఫ్యామిలీ డ్రామా, కామెడీ, ఓ సస్పెన్స్ ఎలిమెంట్‌తో రూపొందిన సినిమా ఇది. ఈ సినిమాలో రకుల్‌ప్రీత్ సింగ్ పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పాత్రలో రకుల్ కనిపిస్తారని బాలీవుడ్ టాక్. ఇక కార్తీక్ ఆర్యన్ హీరోగా, భూమి ఫడ్నేకర్, అనన్య పాండే హీరోయిన్లుగా నటించిన సక్సెస్‌ఫుల్ మూవీ 'పతీ పత్నీ ఔర్ వో' (2019) సినిమాకు సీక్వెల్‌గా 'పతీ పత్నీ ఔర్ వో దో' చిత్రం రూపొందిన సంగతి తెలిసిందే.





# డిసెంబరులో శంబాల

ఆది సాయికుమార్ హీరోగా నటించిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల: ఏ మిస్టికల్ వరల్డ్'. అర్చన అయ్యర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో స్వాసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ కీలక పాత్రల్లో నటించారు. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను డిసెంబరు 25న విడుదల చేయనున్న ట్లుగా వెల్లడించి, శనివారం రిలీజ్ డేట్‌పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. "పాన్-ఇండియా స్థాయి కంటెంట్ ఉన్న సినిమా ఇది. ప్రస్తుతంపోస్ట్‌ప్రొడక్ష న్ వర్క్స్ జరుగుతున్నాయి. సిల్వర్ స్క్రీన్‌పై విజువల్ వండర్‌లా కనిపిస్తుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు నేపథ్య సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: ప్రవీణ్ కె. బంగారి.



# సూర్య 47 కోసం స్టార్ కపుల్..

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ సూర్య. ఇప్పటికే ఆర్జే బాలాజీ డైరెక్షన్‌లో నటిస్తున్న కరుప్పు సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నాడు. మరోవైపు సూర్య 47 ప్రాజెక్ట్ కూడా ట్రాక్‌పైనే ఉంది. జీతూ మాధవన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. మల యాళంలో యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ ఆవేశం చిత్రాన్ని డైరెక్ట్ చేసిన జీతూ మాధవన్ నుంచి వస్తున్న సినిమా కావడంతో మూవీ లవ ర్స్‌లో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇదిలా ఉంటే ఈ మూవీలో స్టార్ కపుల్ సందడి చేయ బోతున్నారన్న అప్‌డేట్ ఒకటి వైరల్ అవుతోంది. ఇంతకీ వారెవరనే కదా మీ డౌటు. మలయాళ స్టార్ కపుల్ ఫహద్ ఫాసిల్, నజ్రియా నజీమ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారట. తాజా టాక్ ప్రకారం ఫహద్ ఫాసిల్ ఇందులో విలన్‌గా కని పించనుండగా.. నజ్రియా నజీమ్ కీ రోల్‌లో నటి స్తున్నట్టు ఓ వార్త ఇప్పుడు సినిమాపై అంచనాల పెంచేస్తుంది. ఈ చిత్రంలో సూర్య పవర్ ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడని తెలిసిందే.

సూర్య కొత్తగా లాంచ్ చేసిన ప్రొడక్షన్ హౌస్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా.. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఫహద్ ఫాసిల్ హీరోగా జీతూ మాధవన్ తెరకెక్కించిన ఆవేశం బాక్సాఫీస్ వద్ద రికార్డుల వర్షం కురిపించింది. మరి జీతూ మాధవన్ సూర్యతో సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నాడన్నది సర్వ త్రా ఆసక్తి నెలకొంది.

# కెరీర్‌లోనే తొలిసారి..

పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టగా.. వీటిలో ఒకటి ఉస్తాద్ భగత్ సింగ్. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీకి హరీష్ శంకర్ దర్శకత్వంలో వహిస్తున్నాడు.తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న భామల్లో ఒకరు రాశీఖన్నా. తెలుగు, తమిళ భాషల్లో లీడింగ్ యాక్టర్లతో కలిసి నటిస్తూ ఎప్పటికప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంది. ఈ బ్యూటీ ఇటీవలే తెలుసు కదా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. రాశీఖన్నా తొలిసారి ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో పవన్ కల్యాణ్‌తో కలిసి నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రమోషన్స్‌లో ఈ మూవీ గురించి మాట్లాడింది. ఈ మూవీ గురించి ఆసక్తికర విషయం చెప్పి సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. తన కెరీర్‌లో మొదటిసారి స్క్రిప్ట్ వినకుండా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు సంతకం చేశానంది. నాకు పవన్ కల్యాణ్‌తో కలిసి నటించాలని ఎప్పుడూ ఉండేది. హరీష్ శంకర్ నాకు ఉస్తాద్ భగత్ సింగ్ రోల్ ఆఫర్ చేసిన వెంటనే అసలు కథ కూడా వినకుండా ఒకే చెప్పేశా. ఆఫర్ వచ్చినప్పుడు చాలా థ్రిల్ అయ్యా.. పవన్ కల్యాణ్ నిజంగా చాలా పవర్ ఫుల్, ఆయన ఎప్పుడూ సామాన్య ప్రజల గురించి ఆలోచిస్తుంటారు..ఆయన గొప్ప మానవతావాది అని చెప్పకొచ్చింది రాశీఖన్నా.. ఇప్పడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నాకీలక పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ స్టైల్ ఆఫ్ మ్యానరిజంతో సాగుతున్న డైలాగ్స్ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com